# 'అమ్మ'కి ఆదివారం లేదా?

ఇంకా తెల్లారలేదుగానీ, తెల్లారగట్ల వెన్నె లతో తెల్లగా తెల్లారినట్టే వుంది. అప్పుడే ఏం చేద్దామనో అన్నపూర్ణమ్మగారి వాకిట్లో చెట్లమీద పిట్టలన్నీ లేచేశాయి. లేచేసి, దేని రెక్కలతో అది గంతులూ, దేని కంఠంతో అది కూతలూ, అందుకే లేచినట్టు, మొద లెట్టేశాయి. "ఏమిటా గంతులూ? అరుపులూ? పనీ పాటా లేకుండానూ!" అని కాస్త కూకలేసే పెద్ద వాళ్ళెవరూ లేనట్టుంది చెట్ల మీద! .... వాకిట్లో ఎన్ని అంట్లగిన్నెలో! వాటి నిండా ఎన్ని అన్నం మెతుకులో.... ఎన్ని వడియాల పిసళ్ళో!

ఇంకా కావాలంటే వాకిట్లో మొక్కల మీద అక్కడక్కడా ఎర్రనీ పచ్చనీ ఎన్ని పురుగులో!.... అన్ని పురుగుల్ని పెట్టుకుని పిట్టలేవీ వాటి వేపు ముక్కు లన్నా తిప్పకపోతే, ఏమనాలీ వాటినీ? రెండు కాకులు మాత్రం అంట్లగిన్నెలవేపు దూసుకెళ్ళాయి, రయ్యిన. అదీ తెలివంటే! ఊరికే కొమ్మల మీద ఇటూ అటూ గంతులేస్తోంటే ఏం వొస్తుంది పొట్టల్లోకి, పిట్టలకైతే మాత్రం? లేచాక ఇటో అటో ఎటో అటు వెతుక్కో వద్దూ చప్పున? కాస్త ఎండ పొడొస్తే పురుగులు పైపైకి పాకుతూ కూచుంటాయా? అప్పుడు దొరకమంటే దొరుకుతాయా?

ఆ పురుగులికి మాత్రం? ఏం తెలివి వుందీ? చెట్ల మీద అన్ని పిట్టల్ని పెట్టుకుని, తెల్లగా తెల్లారి పోతోంటే, ఆ పాకడాలేవిటి! ఏవిటో.... వాటి ధైర్యా లేవిటో.... అవేవిటో!

పురుగులే కాదు, పిట్టలేకాదు, ఆ ఇంట్లో మను షులు కూడా ఆ పూట అలాగే వున్నారు, తెలివిమాలి!

ఇంకా అరవై ఏడేళ్ళన్నా నిండని జగన్నాథం "పెద్దవాడినైపోలేదూ?" అని రోజూ తనని తను అపా ర్థాలు చేసుకుంటూ, ఎప్పుడూ దగ్గుకుంటూనే ఉంటాడు, 'ఇంతకన్నా ఏం చెయ్యనూ?' అన్నట్టు!.... ఏం చేసేదేమిటి? లేచి, అన్నపూర్ణమ్మతో జత కలిసి ఆ గిన్నెలన్నీ తోముకోకూడదూ? పని మనుషులెందుకూ? కాకులు .... ఆ గిన్నెల్ని అలా బంతుల్లా దొర్లించేస్తోంటే వినపడ్డం లేదూ? .... ఊహూఁ .... తెల్లారాక ఆ పురు షుడు అలాంటి పనులేవీ పెట్టుకోడు. దగ్గులే పెట్టు కుంటాడు! పోనీ అవేమన్నా నిక్షేపంగా తడిదగ్గులా అంటే, అన్నీ పొడి పొడి దగ్గులే! .... పొడి దగ్గులు కూడా వొక దగ్గులేనా? అవి లేకపోతే ఎంతా, ఉంటే ఎంతా? వాటి కోసం కూడా ఇంకా మంచం మీదేనా? ఏవిటో.... ఆయన వయసే ఆయనకి బోధపడదు!

పిట్టలు జగన్నాథాన్ని వినీ వినీ — "జగన్నాథం ఎప్పుడూ అలా దగ్గుతాడెందుకూ? మనం దగ్గు తున్నామా? మనల్ని చూసి నేర్చుకోడేం?" అను కుంటాయి చాలాసార్లు.

"'మన' దాకా ఎందుకూ? అన్నపూర్ణమ్మ దగ్గు తోందా? ఏవిటో, జగన్నాథం మరీనూ...." అను కుంటాయి మళ్ళీ అవే.

"అప్పుడే దగ్గే వయసు కాదు జగన్నాథం నీకూ. దగ్గడానికి అంత తొందరపడతా వెందుకూ? ముందు ముందు ఇంకా బోలెడు కాలం లేదూ దగ్గడానికీ?" అని ఆయనకి ఎవరూ చెప్పరు. చెప్పడానికి ఆయన అసలు ఎవరితోనన్నా మాట్లాడితేనా? మాట్టాడ్డానికి ఆయనకి మాటలే ఉండవు; దగ్గడానికి దగ్గులేగానీ!

పాపం మాటలెందుగ్గానీ, ఏ మాటకా మాటే చెప్పుకోవాలి, ఇంట్లో వాళ్ళు వొచ్చి మాట్టాడితే మాత్రం ఆయన చక్కగానే జవాబులు చెపుతాడు, దగ్గుల్తో! 'అలాగా' అని వొక చిట్టిదగ్గూ, 'సరేలే' అని కాస్త నిడివి దగ్గూ, 'పోనిద్దూ' అని కొంచెం దీర్ఘ దగ్గూ, మొత్తానికి సంభాషణ ముగిసే లోపల, ఏ ఇరవై రెండు దగ్గులో దగ్గి, కష్టం సుఖం అన్నీ మాట్టాడతాడు. ఆశ్చర్యం! ఇంట్లో వాళ్ళందరికీ, నాలుగేళ్ళ మనవడితో సహా, ఆయన దగ్గుభాష కొట్టిన పిండి!

లేచీ లేవగానే చెవినపడే తొలిదగ్గే తొలి పిలుపని తెలిసి కూడా అన్నపూర్ణమ్మ వొక్కోసారి "కాఫీ.... తెమ్మంటా .... రా?" అని ఇంత దీర్ఘం తీస్తోంటే, ఆయన 'ఖంగ్'మని వొక మెరుపుదగ్గు దగ్గుతాడు. అది, విసుగన్నమాట! "అదీ అడగాలా?" అని దానికి

అనువాదం. "సరే.... తెస్తానుండండి" అని ఆవిడ వెనక్కి బైల్దేరుతుంది.

ఇంట్లో దగ్గులంటూ పుట్టి ఏడో ఏడు నడుస్తోన్నా అన్నపూర్ణమ్మ ఇంకా ఈ నాటికీ భర్తగారి దగ్గు దగ్గుకీ కొత్త కొత్తగా మళ్ళీ మళ్ళీ ఉలిక్కి ఉలిక్కి పడుతూనే ఉంటుంది, ఎందుకో!

ఎందుకో ఏవిట్లెండి! తొలి దగ్గుకి తొలి కాఫీ.... మలిదగ్గుకి మలి కాఫీ.... ఏడో దగ్గుకీ ఏడో కాఫీ అందిస్తూ, భర్తగారి దగ్గుల చుట్టూ తిరగడం తప్ప, ఆవిడకి మాత్రం ఏవంత రాచకార్యాలున్నాయి గనకా? ఓ పేపరు చూస్తుందా, ఓ పుస్తకం చదువుతుందా, ఓ మహిళా సంఘానికి పోతుందా? ఇక ఇంట్లో దగ్గులికి ఉలిక్కి పడడాలు కూడా మానుకుంటే, ఆవిడకి మాత్రం ఏం తోస్తుంది గనకా? అందుకూ!

అన్నపూర్ణమ్మ భర్తతోటే కాదు, కోడళ్ళతో కూడా అంత మెత్తగానూ, అంత ఉలిక్కిపడుతూనూ, అంత దీర్ఘాలు తీస్తూనూ మాట్టాడుతూ వుంటుంది! ఏ కోడలికి ఏ పని పురమాయించాలన్నా, "అమ్మాయ్ అరుణా! అమ్మాయ్ కమలా!" అని రేడియో నాట కాల్లో లాగ ఇద్దర్నీ ఒకేసారి పిలుస్తుంది. చెరోచోటా పనుల్లో మునిగిన కోడళ్ళు, చెరోమూలనించీ "వొస్తున్నా నత్తయ్యా!" అని ఏక కంఠంతో కేకలైతే పెడతారుగానీ, వొక్కరూ రారు. ఈవిడే వాళ్ళ దగ్గిరికి పోయి "ఏవిటమ్మా ఇదీ?" అంటుంది. వాళ్ళు "ఇదేవిటంటే అత్తయ్యా...." అని అదేవిటో వివ రిస్తారు. "ఓహో! అదా ఇదీ?" అని ఆవిడ సంతోషించి, ఈలోగా ఏ దగ్గన్నా చెవిన పడితే "వొస్తున్నా నుండండి" అని ఆ దగ్గుకి జవాబిస్తుంది. "ఓసారి హనుమంతు నడిగి .... అదేదో కషాయం వుంద న్నాడు.... కాస్త మింగకూడదూ? .... ఈసారి నే నడుగుతా నుండండి" అని ఆ దగ్గుకి వాగ్దానం చేస్తుంది.

"ఖంగ్...." మంటాడు జగన్నాథం. "ఆఁ.... సింగి నాదం. దగ్గుకి కూడా మందేనా?" అని దాని అనువాదం.

"అలాగంటే ఎలాగమ్మా! నోట్లో మందేసుకోడం అంటే కంఠం పట్టుకుంటుంది మీకు. ఓ గుక్క కాఫీ తెస్తా నుండండి!"

"ఖాంగ్...." మంటాడు ఈసారి. "అదీ, అలా చేద్దూ!" అని దాని తాత్పర్యం!

ఆ తెల్లారగట్ల కూడా జగన్నాథం పిట్టలతో పాటే లేచి, ఒకళ్ళ జోలికీ శొంఠికీ పోకుండా, తన దగ్గులేవో తను దగ్గుకుంటున్నాడు. ఇక పిట్టలన్నీ గూళ్ళకి చేరే దాకా అది అలా సాగవలిసిందే!

"పైసా ఖర్చులేని బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ మనింట్లో!" అంటూ వుంటాడు రెండో కొడుకు వాసు.

"ఏడిశావ్‌లే, పెద్దా చిన్నా లేదా?" అని పెద్దవాడు ప్రసాదు, తన పెద్దరికం ప్రదర్శించబోతాడు, తమ్ముడి ముందు.

"పెద్దా చిన్నా ఉంటుంది లేవోయ్! పెద్ద దగ్గుకీ చిన్నదగ్గుకీ తేడా నాకూ తెలుసులే" అని, చిన్నవాడు పెద్దవాణ్ణి 'పోవోయ్' అనేస్తాడు.

ఇంకా చిన్నవాడు వేణూ అయితే మరీ ఘోరం! "పెద్దేవిటి, చిన్నేవిటి? అందరూ పెద్దే!" అంటాడు. అదేవిటో అతనిది, తేడాలే లేని సిద్ధాంతం! ఎప్పుడు ఎవరితో మాట్టాడినా "తిరగబడు!" అనే మాట తప్ప రెండో మాట రానివ్వడు.

"చూశావా వేణూ? నిన్న మీ అన్నయ్యని కూరలు తెమ్మంటే చేతులూపుకుంటూ వొచ్చి 'అబ్బా, నువ్వే తెచ్చుకో' అంటున్నారు. ఇప్పుడు ఏం వొండనూ?" అని ఏ వదిన అన్నా, ఏ పని అన్నా పురమాయిస్తే, తను మాత్రం తిరగబడడు. అప్పటికే సైకిల్‌తీసి సిద్ధమై పోతాడు.

కానీ, ఆ పూట వేణూని చీకట్నే ఏ వదినా లేపలేదు.

పాతికేళ్ళు నిండిన అరుణ కొంచెం పొట్టీ, కొంచెం బొద్దూ! పొట్టి చేతుల జాకెట్టూ, జాకెట్లమీద తళ్ తళ్ అద్దాలూ, చీర అంచుల నిండా జిగ్ జిగ్ ఎంబ్రాయి డరీలూ ఇష్టం. అద్దాలూ పూసలూ తనే ఓపిగ్గా కుట్టుకుంటుంది. చీకట్నే లేచీ లేవగానే, మొహం కడిగీ కడగ్గానే, ఇంత కుంకం తీసి నుదిటికి అద్దేస్తుంది. అటెనక దొడ్లో చెట్ల వెంట తిరిగి బంతి పువ్వో, మందారపువ్వో, ఆఖరికి కనకాంబరం అయినా సరే, ఏదో ఒకటి సంపాదించి జడపాయల్లో దోపేస్తుంది. ఆ రెండు కార్యాలూ ముగిస్తే తప్ప, వంటింట్లో కాలు పెట్టదు. ఆ పూట ఆ కార్యాలు

రెండూ ఎప్పుడో ముగిశాయి. కానీ వంటింటి ఛాయలకు పోకుండా ఇంకా వీధి వాకిట్లోనే తచ్చాడుతోంది.

ఇంకా పాతికేళ్ళు నిండని కమల కొంచెం పొడుగూ, కొంచెం బక్కా. తోటి కోడలిలాగ తల షోకూ, గుడ్డల షోకూ చూసుకోదు. అసలు కమల పూర్తి పేరు, వేలుముడి కమల! ఇంట్లో వాళ్ళు గానీ, ఇరుగు పొరుగు వాళ్ళుగానీ, కమలని వేలు ముడితో తప్ప ఇంకో రకం కురుల అలం కారంతో చూసి వుండరు. లేస్తే వేలుముడీ, కూచుంటే వేలుముడీ! స్నానానికి పోతూ గట్టి వేలుముడీ, వొచ్చాక వొదులు వేలుముడీ! ఆఫీసుకి పోయేముందే ఎలాగో రెండు పాయలు పైపైన అల్లుతుంది. మళ్ళీ ఆఫీసులో మధ్య మధ్యలో చేతులు రెండూ పైకెత్తేసి జడని కాస్తా వేలు ముడిలోకి తిప్పేస్తుంది. అసలు ఇన్ని మాటలెందుకూ? పెళ్ళి చూపులప్పుడు, కమల మొహంలో సిరులూ కళలూ వాసు సిగ్గు సిగ్గుగా చూస్తూ వుండగానే కమల ఇటూ అటూ కదిలి జడని ముడి పెట్టేసింది!

ఆ వేలుముడి కమల, ఆ చీకట్నే, తల నున్నగా దువ్వి వాలు జడవేసుకుంది — పరమాశ్చర్యంగా! చూస్తే తప్ప ఎవరూ నమ్మరు! తోటికోడలు తప్ప ఎవరూ ఇంకా చూడలేదు.

పొడి పొడి దగ్గులు చెవుల్లోపడి అన్న పూర్ణమ్మ కంగారుపడుతూ ఆ చీకట్నే లేచిపోయి "అమ్మాయ్ అరుణా!" అని ఎందుకో పెద్ద కోడల్ని మాత్రమే పిలిచి "పాలు వొచ్చేశాయేమో చూడమ్మా! మావయ్యకి దగ్గొస్తోంది. వేడిగా కొంచెం కాఫీ ఇస్తానూ...." అని మంచం దిగేదాకా దీర్ఘం తీసింది.

"ఎప్పుడో వొచ్చేశాయి అత్తయ్యా! ఇదిగో, ఇక్కడే ఉన్నాయి. పేపరు కూడా వొచ్చేసింది" అని, సరిగ్గా ఆ మాటలు ఎప్పుడు చెపుదామా అని ఎదురు చూస్తున్నట్టు చురుగ్గానూ, కరుగ్గానూ, ఉత్సాహంగానూ, అరిచింది అరుణ.

"ఎప్పుడో వొచ్చేస్తే లోపలికి తీసుకు రాకుండా ఏం చేస్తున్నావూ.... ?" అని దీర్ఘంతీసి "సరేలే తొందరగా పట్టుకురా! ముందు ఒక సంచి గిన్నిలోకి తీసి ఇయ్యి" అని అన్న పూర్ణమ్మ ముద్దుగా కోడలికి పని పురమాయించింది.

కానీ కోడలు ఒక నవ్వు నవ్వింది — "భలేవారే అత్తయ్యా! ఇవ్వాళ ఆదివారం కాదూ?" అని ఇంకో నవ్వు నవ్వింది.

"ఊఁ.... ఆదివారం అయితే? పాలు లోపలికి తెమ్మంటే ఆదివారం కాదూ ఏమిటి?" అని అన్న పూర్ణమ్మ విచిత్ర పోయింది.

"ఆదివారం.... ఇంట్లో ఆడవాళ్ళందరికీ సెలవు కదా అత్తయ్యా!" అని కోడలు మళ్ళీ నవ్వింది.

"ఆదివారం.... ఆడవాళ్ళకి సెలవా?.... సెలవేమిటి? ఎవరిస్తారు?" అత్తగారు తికమక పడింది.

"వొకరిచ్చే దేమిటి? మనమే తీసుకుంటాం" అని కోడలు పౌరుషపడి "ఇవ్వాళ మనం ఏ పనీ చెయ్యక్కర్లేదత్తయ్యా! రాత్రి అనుకున్నదంతా మరిచిపోయారా ఏమిటి?" అని, ఆ అనుకున్న దేవిటో గుర్తుచేసింది.

"రాత్రి ఏదో నవ్వుతాలుకి అన్నారనుకున్నానే! నిజంగా సెలవా ఏవిటి?"

"నవ్వుతాలేం కాదు. ఆషామాషీ అనుకుంటున్నారేవిటి? ఇంట్లో ఆడవాళ్ళం నలుగురం కదా? ఇవ్వాళ మన నలుగురికీ నిజంగా సెలవే. మీ అబ్బాయిల్ని లేపండి! వాళ్ళే తెచ్చుకుంటారు పాల సంచులు లోపలికి" అని సెలవు దినం ఎలా ప్రారంభం అవ్వాలో కోడలు వివరించింది.

అత్తగారు ఇంకా నమ్మలేనట్టు "ఇవ్వాళ .... ఆడవాళ్ళకి సెలవా?.... పనులన్నీ మొగాళ్ళే చేసుకుంటారా? మరీ.... ఒక వేళా.... వాళ్ళు చెయ్యక పోతే నమ్మా?" అని ఒక సందేహం ప్రకటించింది.

"మీరు మరీనూ అత్తయ్యా! ఎందుకు చెయ్యరూ? మనకి సెలవైతే వాళ్ళు చెయ్యొద్దూ? గవర్నమెంటు రూలు అనుకున్నారా, ఆషామాషీ అనుకున్నారా? ఏం, మనం రోజూ చెయ్యట్లేదూ? వారానికి ఒక్క రోజు వాళ్ళు చెయ్యలేరూ?" అని కోడలు ప్రశ్న మీద ప్రశ్న గుప్పించింది.

అత్తగారికి అప్పటికి గ్రహింపైంది. "అయ్యో ....... అయ్యో ....... ఇదేం చోద్యవమ్మా? ఇలాంటి విడ్డూరాలు పుట్టిస్తున్నారూ? ఆ గవన్నమింటు వాళ్ళకేం పుట్టిందీ? వాళ్ళకి మొగ పిల్లలు లేరూ? ఇప్పుడు మొగాళ్ళు లేచి పనులు చేస్తారా? అవ్వ!" అని బుగ్గలు నొక్కుకుని వాటినీ అలాగే బంధించి పట్టుకుంది.

కోడలు నవ్వి — "అవ్వ అంటారేవిటత్తయ్యా?

ఆడవాళ్ళ కోసం గవర్నమెంటు ఎంత బాగా ఆలో చిస్తోందో అర్థం చేసుకోరేం? మనకోసం చట్టం వొచ్చే స్తోందని సంతోషిస్తామా, 'అవ్వ, అవ్వ' అని బుగ్గలు నొక్కుకుని మొహాలు పాడుచేసుకుంటామా చెప్పండి?" అని సూటిగా ప్రశ్న వేసింది.

"ఇంతకీ.... అదేదో.... ఆ చట్టం ఏదో.... వొచ్చే సిందా, ఇంకా రేపోమాపో వొస్తోందా?"

"ఆఁ.... వొచ్చేసే ఉంటుంది. ఇవ్వాళ వొచ్చేసి నట్టే."

"ఆఁ.... ఇంత చీకట్నే ఏం వొస్తుంది గానీ.... చట్టం వాళ్ళు మాత్రం లేవొద్దూ?.... ఈలోగా.... వొక్క సారి ఆ పాల పొట్లాలు లోపలికి తెచ్చేద్దూ అమ్మా! మంచిదానివి గానీ...."

"అయ్యో అత్తయ్యా! అర్థం చేసుకోరేం? రోజూ ఈ పనులన్నీ మనమే ఎందుకు చెయ్యాలి? మొగాళ్ళం దరికీ సెలవలు ఉంటాయి కదా? మరి మనకి మాత్రం ఉండొద్దా? లేపండి మీ అబ్బాయిల్ని! పాలు వాళ్ళే తెచ్చుకుంటారు లోపలికి."

"అయ్యయ్యో! ఎప్పుడూ చీకట్నే లేచి పనులన్నీ చేసుకునే దానివి. గోవులాంటి మనిషివి! చెప్తే వినేలాగ లేవు.... హు.... కమలనన్నా పిలుస్తాను.... అమ్మాయ్ కమలా! వొక్కసారి లేచిరామ్మా, మళ్ళీ పడుకుందువు గానీ. ఆ కుర్రాడు ఎక్కడో గేటు దగ్గిర పారేసిపోతాడు సంచులు. ఏ కుక్కలు లాక్కుపోతాయో ఏమో. కమలా! లేస్తున్నావా?"

"వొస్తున్నా, వొస్తున్నా అత్తయ్యా! ఎప్పుడో లేచాను" ఎటో పలికింది కమల.

"లేచే వున్నావా? అప్పుడే ఎందుకు లేచావు? ఏం చేస్తున్నావు?"

"పేపరు చదువుకుంటున్నానత్తయ్యా!"

"అయ్యో! పొద్దున్నే పేపర్లు పెట్టు క్కూచుంటే ఎలాగమ్మా!" అత్తగారే కోడలి దగ్గిరికి నడిచి, కోడల్ని చూడగానే మొదట తెల్లబోయి, తర్వాత సంతోషిస్తూ "తలెప్పుడు దువ్వుకున్నావు? ఎంత బాగుందో చూడు జడ అల్లుకుంటే! ఇవ్వాళ నీ బుర్రలో పురుగెలా తిరిగిందీ?" అని నవ్వు మొహంతో చూసింది.

"ఇవ్వాళ ఖాళీ ఉంది కాబట్టి తీరిగ్గా తల దువ్వు కున్నా నత్తయ్యా!"

"ఆఁ.... మరీ చోద్యం! రోజూ మాత్రం అంత ఖాళీ లేదా? సరేలే, పాల సంచులు లోపలికి తీసుకు రామ్మా! మావయ్యకి దగ్గొస్తోంది. తొందరగా కాఫీ ఇస్తానూ!"

"అయ్యో. దగ్గొస్తోందా? అయితే వేడి కాఫీ తాగాలి తొందరగా.... మరి ఎలా గత్తయ్యా! ఇవ్వాళ మనం దరికీ సెలవు. మొగాళ్ళే ఈ పనులన్నీ చూసుకోవాలి. వాళ్ళే అందరికీ కాఫీలివ్వాలి. ఎప్పుడు లేస్తారో ఏమో!" అని కంగారుపడింది కమల.

అత్తగారు తెల్లబోయి "నువ్వూ అదే పాటా? ఇద్దరూ వొక బళ్ళోనే చదివినట్టున్నారే! మొగ పిల్లలు లేచి కాఫీలు పెడతారా మనకి?" అని తెల్లబోవడం కొనసాగించింది.

కమల మొహంలోకి అప్పుడే కోపం తొంగి చూసింది. "ఏం, ఎందుకు పెట్టరూ? పూట పూటా మనం పెట్టి అందించడం లేదూ?.... లేచి మొహం కడుక్కోగానే పేపరు చదువుకోవాలని నాకెంత కోరికో! ఇవ్వాల్టికి అయ్యింది! పేపరు చదువుతూ కాఫీ తాగుతోంటే ఎంత బాగుంటుందో! మొగాళ్ళు అలాగే చేస్తారు."

"మీ పిచ్చి దొంగల్దోలా! వాళ్ళు లేవడవూఁ.... మనం వేడి వేడిగా ఊదుకుంటూ కాఫీలు తాగడ వూనా? మీరు నిజంగానే ఎదురు చూస్తున్నారా ఏవిటర్రా, వాళ్ళు కాఫీలు పెడతారనీ?"

"ఏం, ఎవడికోసం పెడతారు? పెట్టక పోతే గవర్నమెంటు ఊరుకుంటుందనుకుంటున్నారా?"

"ఏం చేస్తుందీ గవన్నమింటూ?"

"ఏం చేస్తుందో చూద్దురుగాని మీరే."

లోపల్నించీ దగ్గులు చెవిన పడనేపడ్డాయి.

"అయ్యయ్యో! మావయ్య దగ్గుతున్నారు. నేనన్నా పోయి తెస్తాలెండి" అని అన్నపూర్ణమ్మ వీధి వాకిలివైపు బయల్దేరింది.

"అత్తయ్యా! మీరు తేవడానికి వీల్లేదు!" అని అరిచింది అరుణ కోపంగా. అత్తగారితో ఎన్నడూ గట్టిగా కూడా మాట్లాడటం ఎరగని అరుణ శాసించినట్టే అంది ఆ మాటలు. "మీరైతే ఒకటీ, మేమైతే ఒకటీనా? ఇవ్వాళ మీరు చేసినా మేం వొప్పుకోం. మీ కొడుకుల్ని లేపండి. ఇంకా ఎప్పుడు లేస్తారేవిటి?"

"అయ్యో! మావయ్య దగ్గుతున్నారమ్మా!"

"దగ్గితేనే మంచిదత్తయ్యా! దగ్గితే అదే తగ్గుతుంది."

"ఏవిటీ తగ్గేదీ?"

"దగ్గే! దగ్గితే దగ్గు తగ్గిపోదూ?"

"బాగానే ఉన్నాయి మీ కవుర్లు"

"ఇవాళ మీరాగోలలేవీ పట్టించుకోకండి! తొందరగా మొహం కడుక్కురండి! కవుర్లు చెప్పుకుందాం. లేకపోతే ఏ పచ్చీసో ఆడుకుందాం."

"ఆయన దగ్గుతోంటే, మనం పచ్చీసు ఆడుకుందామా? దగ్గు వినపడకుండానా?"

"దానికి మనమేం చేస్తాం? మీ కొడుకులకు ఉండాలి ఆ శ్రద్ధ."

అత్తగార్ని తమతో కూడగట్టుకోకపోతే లాభం లేదని కమలకి అప్పుడే అర్థమైంది. అత్తగారికి నచ్చచెప్పే ధోరణిలో కంఠం తగ్గించి గుసగుసలాడింది. "అత్తయ్యా, ఇది మన మంచికే. ఆడవాళ్ళందరం ఒక కట్టుగా ఉండాలి. అదే మనకి బలం!.... మీరు చిన్నతనంనించీ ఇంట్లో పనులన్నీ చేస్తూనే వున్నారు కదా? ఒక్క రోజన్నా మావయ్యగానీ, మీ కొడుకులు గానీ, మీకు సాయం చేశారా చెప్పండి? వేణూ కొంచెం నయమే కానీ.... మరి మిగతా వాళ్ళూ? వాళ్ళు మీకేం చేశారు?"

"చెయ్యలేదనుకో. నేనైనా వాళ్ళకేనాడూ ఇంటి పనులు చెప్పలేదమ్మా! మొగ సన్నాసులు.... వాళ్ళేం చేస్తార్లే అనీ. తెగులొచ్చినా రోగమొచ్చినా, లేవగలిగినా లేవలేకపోయినా, ఎలాగో ముక్కుతూ మూలుగుతూ, నేనే చూసుకునే దాన్ని. ఇవ్వాళంటే ఈ కుక్కర్లూ గిక్కర్లూ వొచ్చాయి గానీ, మా రోజుల్లో ఇవన్నీ ఎక్కడివీ? ఇదుగో, ఈ నాటికి మీరొచ్చాక, కాస్త కాళ్లూ చేతులూ దగ్గిర పెట్టుకుని కూచుంటున్నాను."

అత్తగారు మెత్తబడుతోందని కమలకి బాగానే అర్థమయింది. ముసి ముసి నవ్వులతో సంతోషంగా చూసింది.

అత్తగారు మళ్ళీ అంది — "మా రోజుల్లో నేనొక్కదాన్నేనా? అందరూ అంతే. మా అత్తగారూ వాళ్ళూ వొడ్లు కూడా దంచేవారట. మా అమ్మ ఎప్పుడు నిద్రపోయేదో నా కళ్ళతో నేను చూడలేదు."

"చూశారా మరి? ఆడవాళ్ళు ఎప్పుడూ 'అంతంత' కష్టాలు పడ్డారు. అందుకే ఆడ వాళ్ళకి ఈ నాటికైనా వారానికోరోజు సెలవు ఇస్తున్నారు. దాన్ని మీరు అడ్డం కొడతారా చెప్పండి? మీరే మీ కొడుకులికి వంట చేసి పెడతారా చెప్పండి?"

"అబ్బే, నేనెందుకు అడ్డం కొడతానుగానీ, కొంచెం పాలు లోపలికి తెచ్చేసి, కొంచెం ఆయనకి కాఫీ ఇచ్చేసి...."

"ఆఁ.... ఇలా 'కొంచెం, కొంచెం' అని మొదలు పెడితే అన్నీ మన నెత్తినే పడతాయి. ఇక వాళ్ళు చేసేదేముంటుంది? మనమే ఇలా మెత్తబడిపోతే మనల్ని చట్టాలేం రక్షిస్తాయి?.... లేవమనండి మీ పెద్ద కొడుకులిద్దర్నీ. పాపం వేణూని లేపకండి. అతనికి వీలున్నప్పుడల్లా మనతో పాటు చేస్తూనే వున్నాడు. అతన్ని వొదిలేద్దాంగానీ పెద్దవాళ్ళిద్దర్నీ ఇవ్వాళ పనుల్లోకి దించి తీరాలి! లేవమనండి ఇద్దర్నీ. తొందరగా లేచి పాలు లోపలికి తెచ్చి, అందరికీ కాఫీలు ఇవ్వమనండి!"

అరుణ అందుకుంది — "తర్వాత ఇంకా టిఫెను చెయ్యాలి. వంట చెయ్యాలి. బోలెడు పనులున్నాయి. అవన్నీ ఎప్పుడు చేస్తారు? తెల్లగా తెల్లారి పోయింది."

అన్నపూర్ణమ్మ మళ్ళీ కొత్తగా ఉలిక్కి పడింది — "అవన్నీ కూడా చెయ్యాలా? చెయ్యాలన్నా వాళ్ళకి రావు కదర్రా!" అని నోరు తెరిచింది.

పెద్ద కోడలు ఖయ్యిమంది — "రాకపోతే నేర్చుకుంటారు. మనం నేర్చుకో లేదూ? నేర్చుకుంటే అన్నీ వొస్తాయి. కావాలంటే రెండు వారాల దాకా మనం దూరంగా నించుని సలహాలిద్దాం" అంది.

అన్నపూర్ణమ్మకి ఎందుకో నచ్చలేదు. మళ్ళీ మొదటికొచ్చింది. "యావిటో.... ఈ చట్టాలూ చట్ట బండలూనూ.... ఎంకి పెళ్ళి సుబ్బి చావు కొచ్చిందనీ.... వాళ్ళులేవనూ, మనకి వంటలు చేసి పెట్టనూ! ఇక తిన్నట్టే! ఎవరన్నా వింటే నవ్వుతారు" అని తనే నవ్వింది తాపీగా.

కమలకి అత్తగారి మీద బాగా కోపం వచ్చింది — "ఎవరన్నా కాదు. మొగాళ్ళొక్కళ్ళే నవ్వుతారు. వాళ్ళు నవ్వితే మనకేం లెక్క? గవర్నమెంటే మన పక్షాన ఉంది" అంది. అయినా అత్తగారి సపోర్టు ఎంత

తప్పనిసరో కమలకి మళ్ళీ గుర్తొచ్చింది. బతిమిలాట లోకి దిగింది హఠాత్తుగా. "మా మాట వినండత్తయ్యా! చక్కగా కూచోండి. పేపరు చదివి వినిపిస్తాను. ఆహా.... ఎంత తీరిగ్గా ఉందో ఈ పూట! ఇన్నాళ్ళూ నేను ఎవరికీ ఓటెయ్యలేదు గానీ ఈసారి ఎన్నికలొస్తే ఈ గవర్న మెంటుకే ఓటేస్తాను. ఆడవాళ్ళందరం వీళ్ళకే వెయ్యాలి సుమా!.... మరి చదవనా? వినండి!" అని పేపరు పఠనం మొదలుపెట్టింది. — 'మద్రాసులో స్వల్ప భూకంపం! నిన్న అర్ధరాత్రి మద్రాసులో భూమి స్వల్పంగా కంపించింది. ఈ కంపనాలు ఇటూ అటూ ఎటైనా పాకవచ్చని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు...."

"అయ్యో పాపం.... పొద్దున్నే ఇదేం కబురే పాపం! ఎవరన్నా చచ్చిపోయారేవిటమ్మా పాపం?"

"అత్తయ్యకి మరీ జాలి" అని నవ్వింది కమల. "లేదులెండి అత్తయ్యా!" అని అత్తగారికి ధైర్యం చెప్పి మళ్ళీ చదవడం ప్రారంభించింది. "జన నష్టం గానీ, ఆస్తి నష్టం గానీ జరగలేదూ. కొంచెం కిటికీ తలుపులూ అవీ దబ దబా కొట్టుకున్నాయీ...."

"పోనీలేమ్మా!" అని అత్తగారు చాలా సంతోషించింది. "లేచే పాటికి కాళ్ళూ చేతులూ అవీ విరిగి ఉంటే లేచి చూసుకుని ఉసూరుమంటారు. ఎవరూ చచ్చిపోకుండా, ఇళ్ళవీ పడిపోకుండా, పెద్ద పెద్ద భూకంపాలొస్తే చూడ్డానికి కూడా సరదాగా ఉండదూ? అవునూ కమలా — నాకు తెలీ కడుగుతానూ, పొలాల్లో భూకంపం వస్తుందనుకో. పొలం విచ్చుకుంటుంది కదా? అప్పుడు మనం ఆ పగుళ్ళలోనించి లోపలికి చూస్తే లోపల ఏం కనిపిస్తుందంటావూ?.... పాతాళంలో యమధర్మరాజూ వాళ్ళూ ఇటూ అటూ తిరుగుతూ కనపడతారేమో, యేం?"

"అవన్నీ కట్టుకథలత్తయ్యా! అక్కడ కూడా మట్టీ, నీళ్ళే ఉంటాయి. మహా అయితే కప్పలుంటాయి ఇటూ అటూ దూకుతూ"

"భా! అంతేనా? ...... మరి అక్కడ పాతాళం ...... నరకం ...... ఇదీ అదీ అంటారేం?" అని అత్తగారు విస్తుపోతోంటే లోపల్నించి దగ్గులూ, వాటితో పాటే "పూర్ణా!" అని ఓ కేకా! "కాఫీ తెస్తానని వెళ్ళావు. పొద్దున్నే పాతాళాలూ .... నరకాలూ .... ఏవిటి? బాగానే చూపిస్తున్నావు నరకం ఇక్కడే!" అని నిష్ఠూరాలూ! మళ్ళీ ఖంగ్ .... ఖంగ్‌లూ!

"అయ్యయ్యో! నా మతిమండా! ఏవిటో భూకంపం అంటే సరదాపడీ.... కమలా! తొందరగా ఆ పాలు తెచ్చెయ్యమ్మా! మీ అప్పగారెటు పోయిందో, నువ్వన్నా నా మాట విందూ తల్లీ!" అని అత్తగారు కోడల్ని మళ్ళీ బతిమాలింది.

కమల మళ్ళీ ఓర్పుని ఆశ్రయించాల్సి వచ్చింది — "మళ్ళీ మొదటి కొస్తారేవిటత్తయ్యా? ఇవాళ మనకి సెలవు అని అర్ధరాత్రి దాకా గుర్తుపెట్టుకోండి. మళ్ళీ మనం పనుల్లోకి దిగేది రేపొద్దున్నే.... నేనే పిలుస్తానుండండి వాళ్ళని. వేణూ! వేణూ! నువ్వు లేవొద్దుగానీ మీ అన్నగార్లిద్దర్నీ లేవమనూ! ఎంత తెల్లారిపోయిందో తెలుసా? రోజూలాగ ఆదివారాలు కూడా 8 గంటల దాకా పవ్వళించే కాలం పోయిందని చెప్పు! మావయ్య దగ్గుతో వూపిరాడక అల్లాడిపో తున్నారు. లేవండి తొందరగా, అక్కయ్యా! బావగార్ని తొందరగా లేవ మనూ!" అని కమల పెద్ద పెద్ద కేకలు వేసింది.

రేఖ కళ్ళు నులుపుకుంటూ లేచి వొచ్చింది. అన్న పూర్ణమ్మలాగే మహామెత్తని కుదురైన పిల్ల రేఖ. "ఏమిటి వొదినా! పొద్దున్నే హడావుడి చేసేస్తున్నారూ!" అంటూ ఇంకా నిద్రమత్తులో మెట్లమీద కూర్చుంది.

"నువ్వప్పుడే ఎందుకు లేచావూ? ఇవ్వాళ ఆడ వాళ్ళకి సెలవేగా? మీ అన్నలిద్దర్నీ లేపేసి ఇంకా కాస్సేపు పడుకో! వాళ్ళు టిఫిన్ చేసేప్పటికి లేపుతాంలే నిన్ను!" అని కమల ఆడబిడ్డని ఇంకా నిద్ర పొమ్మని ప్రోత్సహించింది.

రేఖ బాగా తేరుకుని — "ఏమిటి వొదినా మరీనూ, నిన్న ఏదో సరదాకి అనుకున్నాంగానీ" అని నవ్వింది.

"సరదా ఏమిటి, సరదా? మేం నిజంగానే అనుకున్నాం. నీకేం తెలుస్తుంది మా కష్టం? అన్నీ అమిర్చి పెడితే వేళ పట్టుకి తినేసి కాలేజీకి పోయేదానివి. నీకు అర్థం కాదులే అప్పుడే. బైట ఉద్యోగం చేస్తోన్నా ఇంట్లో పనులన్నీ నేనే చెయ్యాలా? నీ అన్న ఏనాడన్నా ఇక్కడ పుల్లతీసి అక్కడ పెట్టాడా? ఇవ్వాల్టికి కదా మా కష్టం గవర్నమెంటు కనిపెట్టింది? వెళ్ళి అన్నల్ని లేపుదూ! ఒకరు కాఫీలు పెడుతోంటే ఒకరు ఉప్మాయో ఏదో ఒకటి చేస్తారు. చూడు, పాల పేకట్లు ఇంకా అక్కడే పడి ఏడుస్తున్నాయి."

"అయ్యో, ఇంకా లోపలికి తేలేదా? నేను తెస్తా

నుండు" అని రేఖ చెంగున లేచింది.

"రేఖా!" అని కమల కోపం ప్రదర్శించింది. "నువ్వు తేవడానికి వీల్లేదు. ఆడ వాళ్ళందరం ఒక కట్టుగా ఉండాలి. ఇవ్వాళ పనులన్నీ మొగాళ్ళే చెయ్యాలి, తెలిసిందా?"

"అవుననుకో వొదినా! నాన్నకి తొందరగా కాఫీ కావాలి కదా?...."

"అందుకే మరి, మీ అన్నలు తొందరగా లేస్తే సమస్య తీరిపోతుంది."

అరుణ లోపలి నించి సంబరంగా — "కమలా! మీ బావగారు లేచి పోతున్నారులే" అని కేక పెట్టింది.

వేణూ కూడా లేచి వచ్చాడు — "వదినలిద్దరూ పోరాటం నిజంగానే మొదలు పెట్టేశారా?" అని కులాసాగా నవ్వాడు.

"ఏం, 'నిజం'కాక? ఒకరొచ్చి 'సరదాకా' అంటారు. ఇంకొకరొచ్చి 'నిజంగానా' అంటారు. అంత వెటకారంగా ఉందా మా సెలవు రోజంటే మీకు?" అని మొహం చిట్లించింది కమల.

"వెటకారం కాదుగానీ ఈ చట్టాల్ని మీరెంత నమ్ముతున్నారో కదా అనీ జాలిగా ఉంది" అని ఈ సారి జాలిగా నవ్వాడు వేణూ.

ఎన్నడూ పుస్తకాలు ముట్టుకోని అరుణ, చేతిలో గ్రంథంతో వస్తూ — "అదేమిటి వేణూ? నువ్వెప్పుడూ మా తరుపునే ఉంటావు. మొగాళ్ళు కూడా ఇంట్లో పనులు చెయ్యాలంటావు. ఇవ్వాళ ఇలా మాట్లాడు తున్నావేమిటి?" అని ఆశ్చర్యపడింది.

"పెద్దొదినా! నీకు ఎన్నిసార్లు చెప్పాను, చిన్న వొదిన లాగ నువ్వుకూడా ఉద్యోగం చెయ్యాలని? బైటకి వెళ్ళడం అంటేనే పడదు నీకు."

"ఇది మరీ బాగుంది. కమల అంటే చదువుకుంది కాబట్టి ఉద్యోగం సంపా దించుకుంది. నా వానా కాలం చదువుకి నేనేం చేస్తాను బైటికిపోయి?"

"నీ చదువుతో కూడా బోలెడు పనులు చెయ్యొచ్చు. స్వంత సంపాదన లేకపోతే, ఈ హక్కులూ సెలవలూ.... ఇవన్నీ ఏమిటి?"

"ఆఁ.... నువ్వూ మొగాడివే లెద్దూ! ఆడవాళ్ళ సెలవు అంటే మొగాళ్ళకెవరికీ నచ్చదులే" అని మొహం తిప్పేసింది అరుణ.

"బాగా చెప్పావు" అని కమల కూడా తల తిప్పేసింది.

అప్పటికి లేచి వొచ్చాడు కమల భర్తగారు — "పొద్దున్న నించీ వొకటే గొడవ గొడవ! ఇలా నించున్నా రేమిటి ఫోటో కోసం నించున్నట్టు అందరూ?" అని అందర్నీ ఎగాదిగా చూస్తూ కమల వాలు జడ చూసి నోరు తెరిచాడు.

అరుణ భర్తగారు తువ్వాలుతో మొహం తుడుచు కుంటూ వొచ్చి — "అరుణా! కొంపలు మునిగినట్టు ఎందుకంత తొందరగా లేపేశావ్? ఏకంగా మొహం కడుక్కుని వచ్చేశాలే. కాఫీ అయిందా? తీసుకురా తొందరగా" అని ఆజ్ఞాపించి, తువ్వాలుతో మళ్ళీ మొహం శుద్ధి కార్యక్రమంలో పడ్డాడు.

"ఆహ్హాహ్హా" అంటూ చెల్లెలూ తమ్ముడూ పెద్ద కంఠాలతో నవ్వారు.

"ఏం, పాలు రాలేదా ఇంకా?" అని సందేహిం చాడు ప్రసాదు.

తల్లిగారు అందుకుంది — "ఏదో శాస్త్రం చెప్పి నట్టుంది. పాలొచ్చి గంట సేపైంది నాయనా! లోపలికి తెండర్రా అంటే, వాళ్ళు తేరటా, నన్ను తేనివ్వరటా! ఆదివారం ఆడవాళ్ళకి సెలవని ఆ ముద నష్టపు గవన్నమింటేదో రాసిందటగా? కోడళ్ళిద్దరూ కొయ్యెక్కి కూచున్నారు. చిన్నావిడ పేపరు పట్టుకుంది. పెద్దావిడ చూడు ..... ఇంత లావు బయ్యిండు పుస్తకం ..... యాభై ఆదివారాలకు సరిపడేది పట్టుకుంది! మీ నాన్నకి ఇప్పటిదాకా కాఫీ ఇవ్వలేదు. ఆయన వొకటే రుస రుసలు నా మీద" అంటూ గత చరిత్రంతా యాకరువు పెట్టేసింది.

ప్రసాద్ గుండె 'గుభేల్'మంది! ఓరి దేవుడో! ఇవ్వాళేనా ఆదివారం? వీళ్ళిద్దరూ సమ్మె మొదలు పెట్టేశారా? తమ్ముడివేపు వోరగా కళ్ళు తిప్పితే అత గాడు అన్నగారిని భయంగా 'ఇప్పుడెలాగ?' అన్నట్టు చూస్తున్నాడు.

'ఎలాగేవిటి? ఎప్పట్లాగే. ధైర్యంగా ఉండు!' అన్ని అన్నగారు కళ్ళతోటే తమ్ముడికి ధైర్యం చెప్పి — "ఊఁ, ఆదివారం అయితే ఏవిటటా? ఇప్పటిదాకా కాఫీ లేదు, గీఫీ లేదు! నిద్రంతా చెడగొట్టింది!" అని రుస రుస లాడాడు.

అన్నపూర్ణమ్మ కొడుకుల్ని చూసి జాలిపడుతూ — "చెప్పేది చెవిన పెట్టరేవిట్రా? వాళ్ళిద్దరూ పనులు

కట్టిపెట్టి కూచుంటే, ఇక మీరు కాకపోతే ఇంకెవరు చేస్తారూ? కంచే చేను మేసిందనీ గవన్నమింటే వాళ్ళ పక్షాన చేరితే ఇక మీరేం చెయ్యగలరూ? తొందరగా పనుల్లోకి దిగి ఏదో కాస్త ఉడకేసి అయిందనిపిం చెయ్యండి నాయనా! ఆది వారం ఆదివారం మీకీ చెర తప్పదు ఇక. ఏదో పుట్టింది ప్రెపంచానికి! ఆడవాళ్ళు పనులు మానేసి కుర్చీ లెక్కి కూచుంటే కొంపలో పిల్లా జెల్లా, ముసిలీ ముతకా, యావైపోతారూ?.... హూ.... ఏవిటో" అని స్వగతాలతో ముగించింది.

చిన్న కోడలు వెటకారంగా — "ఏవీ అయిపోరు. ఆడవాళ్ళు కుర్చీ లెక్కినప్పుడు, మొగాళ్ళు కుర్చీలు దిగితే సరిపోతుంది" అని అత్తగారికి చక్కటి మార్గం చూపించింది.

"అందుకేగా అమ్మా! అలాగే చెయ్యమని చెప్పా నుగా వాళ్ళకీ!"

ఎందుకన్నా మంచిదని అప్పటికే దూరంగా పోయి పచార్లు చేస్తోన్న ప్రసాద్, తమ్ముడి ఎడం చెవిలో "అరేయ్! ఈ సారి మనం ఈ గవర్నమెంటుకి ఓట్లు వెయ్యకూడదు. గుర్తుపెట్టుకుని అప్పుడు గుర్తుచెయ్యి నాకు" అని గుసగుసలాడాడు.

"అబ్బా, ఎప్పుడో ఓట్ల సంగతి ఇప్పుడెందు కన్నయ్యా! ఇప్పుడు మన పాట్ల సంగతి చూడు. అమ్మ కూడా ఇలా అయి పోయిందేవిటి? మనల్నే చెయ్య మంటోంది. కోడళ్ళని కేకవెయ్యదేం?" అని బేలగా చూశాడు తమ్ముడు.

"మీ ఆవిడ, అత్తగార్ని బాగా బుట్టలో వేసింది. అయినా ఏం ఫర్వాలేదు. ధైర్యంగా ఉండమన్నానా లేదా? ధైర్యం పురుష లక్షణం" అని ప్రసాద్ సోదరు డికి కర్తవ్యం బోధించి, పైకి గట్టిగా "రాత్రి, అర్ధ రాత్రి దాకా ఈ అప్పా చెల్లెళ్ళిద్దరూ వాకిట్లో కూర్చుని గుడగుడలాడుకున్నారు. ఇందుకా? ఇప్పుడు మేం పనులు చెయ్యాలా?" అంటూ సూటిగా వ్యవహారం లోకి దిగాడు.

"ఎవడి కోసం?" అని, అంతకన్నా సూటిగా జవాబు చెప్పింది అరుణ. పైగా చక చకా ఆర్డర్లు జారీ చేసింది — "తక్షణం పాల పేకెట్లు లోపలికి తెచ్చి గిన్నెల్లో పోసి కాగబెట్టి ముందు మావయ్యకి కాఫీ ఇవ్వండి! తర్వాత మా అందరికీ కూడా కాఫీలివ్వండి! తర్వాత ఉప్మా చెయ్యండి! తర్వాత మళ్ళీ కాఫీ లివ్వండి రెండోసారి!"

కమల మధ్యలోనే అడ్డొచ్చి — "ఉప్మా ఏవి టక్కయ్యా, నేనొప్పుకోను. ఇడ్లీ చెయ్యమను! ఏం, ప్రతీ ఆదివారం మనం ఇడ్లీ చెయ్యడం లేదూ?" అని ఉప్మాని తిరస్కరించింది.

"ఏదో ఈ మొదటి వారం ఆ మాత్రం చెయ్య నిద్దూ కమలా! నెమ్మదిగా వాళ్ళే నేర్చుకుంటారులే" అంది అక్కగారు కొంచెం నవ్వి.

"నువ్వప్పుడే మెత్తబడి పోతున్నా వేమి టక్కయ్యా?" అని ఆశ్చర్యపడింది చెల్లెలు.

"చ ఛ! నేనెందుకు మెత్తబడతానూ? మొదటి వారం కదా అని అన్నానంతే."

"సరేలే అయితే. ఉప్మా ఈ వొక్కసారే. వొచ్చే ఆదివారం నించి నేనొప్పుకోను" అని గట్టిగా తేల్చి చెప్పింది కమల.

అరుణ మళ్ళీ ఆజ్ఞలు సాగించింది. "ఆఁ.... టిఫిన్ తర్వాత కూరల పని మొదలు పెట్టండి! బెండకాయ వేపుడూ, పప్పుచారూ కావాలి మాకు! ఏం, మీకు కావలసినట్టు మేం వండడం లేదా? మావయ్యకి తప్ప కుండా రోటి పచ్చడి ఉండాలి. బీరకాయ పచ్చడో, వంకాయ పచ్చడో చెయ్యండి! ఏదైనా ఇష్టంగానే తింటారు."

కమల ఉత్సాహం ఉరకలు వేస్తోంటే "తర్వాత నేను చెపుతానుండు" అంటూ అడ్డొచ్చింది. "ఆది వారాల్లో మధ్యాన్నాలు కూడా ఏదన్నా టిఫెను ఉండా లంటారుగా మీరే. గారెలకి పప్పు ఇప్పుడే నానబెట్టండి! కొబ్బరికాయ పచ్చడి ఇప్పుడే చేసి పెట్టెయ్యండి! మధ్యాహ్నం 3 గంటలప్పుడు పప్పు రుబ్బి గారెలు వేడి వేడిగా వేసి ఇవ్వండి అందరికీ."

కమలకి అరుణ అడ్డొచ్చింది — "సాయంత్రం వంట సంగతి అప్పుడే చెపు తాంలెండి. ఇప్పుడు చెప్తే మరిచేపోతారు."

"బట్టల సంగతి చెప్పవేం అక్కయ్యా? బుట్టెడు గుడ్డలున్నాయి. అన్నీ నానబెట్టి ఉతకండి! రంగు బట్టలూ తెల్లబట్టలూ కలపకూడదు. వేరు వేరుగా నానబెట్టాలి. జాకెట్లూ, చీరలూ కలపకూడదు. వంట అవగానే బట్టల పని చేసెయ్యండి! లేకపోతే సాయం

త్రానికి తొందరగా ఆరవు."

అరుణ అందుకుంది. "ఇవాళ లక్ష్మి రాదు బహుశా. నిన్న జ్వరంతో వొస్తే తగ్గేదాకా రావొద్దని చెప్పాం. బట్టల పని అవగానే అంట్లు తోమి సర్దె య్యండి!"

మళ్ళీ కమల అందుకుంది. "అంట్ల పని అవగానే గదులూ వాకిళ్ళూ సుభ్రంగా ఊడ్చెయ్యండి! లక్ష్మి మానేసినప్పుడల్లా ఈ పనులన్నీ మేమే చేసుకుంటాం."

ప్రసాద్ అంతసేపూ పళ్ళు నూరుతూ పళ్ళన్నీ కదల గొట్టుకున్నాడు. "ఈ పనులన్నీ మేం చేస్తోంటే మరి మీరేం చేస్తారు?" అన్నాడు చెదిరిపోయి బెదిరి పోతోన్న పళ్ళతో.

"వినాలని ఉందా? ఈ పనులన్నీ రోజూ ఆడవాళ్ళు చేస్తోంటే మీరేం చేస్తూ ఉంటారో అదే ఇవ్వాళ మేం చేస్తాం" అంది చేతులు తిప్పుతూ కమల, నదురూ బెదురూ లేకుండా.

అరుణ అందుకుంది — "రోజూ ఆడ వాళ్ళు చేసేపని ఇవ్వాళ మొగాళ్ళు చేస్తారు. అంతే. అంతకన్నా ఏం కాదు. కదే కమలా?"

ప్రసాదు పళ్ళు ఊడినాసరే గట్టిగా ఎదురు తిరగ దల్చుకున్నాడు — "రోజూ మీరు మాత్రం ఇన్ని పనులు చేస్తున్నారా? ఉదాహరణకి — బట్టలే తీసు కుందాం. ఒక్క రోజుకి గంపెడు గుడ్డలు ఎలా చేరాయి? 3 రోజుల్నించీ ఉతక్కుండా మురగబెట్టి మాకు అప్పజెపుతారా?" అని పాయింటు తీశాడు.

"కావాలంటే అన్నీ తీసి లెక్కలు చూసుకోండి. అన్నీ నిన్న విడిచిన బట్టలే. కాకపోతే దుప్పట్లు మిగల మాశాయని నాలుగు దుప్పట్లు కూడా పడేశాం" అన్నారు అక్క చెల్లెళ్ళు.

వాసు కూడా పోరాటంలోకి దూకాడు "ఏం, అంత మిగల మాసేదాకా ఉతక్కుండా ఎందుకు ఉంచారు? ఎలాగా మాసేశాయిగా? ఇవ్వాళ ఉతక్కపోతే మాత్రం ఇంకేం మాస్తాయి? అవన్నీ రేపు మీరే ఉతుక్కోండి!" అని అరిచాడు.

కమల, వాలుజడని గట్టిగా ముడి పెట్టేసి, యుద్ధ రంగంలో దూకుతూ ముందుకొచ్చింది — "ఓహో! ఇవ్వాళ ఉతకడం ఎగ్గొట్టి మళ్ళీ మాకే అప్పజెప్పాలని చూస్తున్నారా? అంత తెలివి తక్కువ వాళ్ళమేం కాదు. ఇవ్వాళ పనులన్నీ ఇవ్వాళే అయిపోవాలి" అని అరిచింది.

అన్నపూర్ణమ్మ నెత్తీ నోరూ కొట్టుకుంటూ — "ఆ గుడ్డల గోల ఎందుకర్రా ఇప్పుడూ? ఎప్పుడో ఉతుక్కో వొచ్చు. అవేమన్నా కూడడుగుతున్నాయా, నీళ్ళడుగు తున్నాయా? ముందు మీ నాన్నకి కాఫీ సంగతి చూడండీ" అని గోల పెట్టింది.

ఆ యుద్ధ బీభత్సంలో 'చిన్ని' ఒక్కడే తక్కువ అప్పటిదాకా. వాడు కూడా లేచి రావడంతో ఆ లోటు కూడా తీరిపోయింది. "అమ్మా.... అమ్మా" అంటూ వాడు ఏడ్చుకుంటూ వొచ్చి అరుణని కావిలించు కున్నాడు.

"లేచావా నాన్నా?" అని అరుణ వాణ్ణి దగ్గిరికి తీసుకోబోయి ఆగింది.

"అమ్మా .... దొడ్డికొస్తోందే .... తీసికెళ్ళూ .... అమ్మా!.... తీసికెళ్ళూ తొందరగా రా."

అరుణ తాపీగా అంది. "ఇవ్వాళ ఆది వారం కదమ్మా! ఆడవాళ్ళకి సెలవన్నమాట. ఇవ్వాళ నేను ఏ పనీ చెయ్యను నాన్నా!"

"ఆదివారం కూడా దొడ్డికొస్తోందే అమ్మా!" అంటూ చిన్నిగాడు కాళ్ళు భూమి మీద ఆన్చకుండా నిట్టలు తొక్కడం మొదలెట్టాడు.

అరుణ బెంబేలు పడలేదు. "నాన్నని తీసికెళ్ళ మనమ్మా" అని కుమారుడికి మార్గం చూపించి, ఆ మాట తనుకూడా భర్తగారితో చెప్పింది. —"ఇదుగో, మిమ్మల్నే.... వీణ్ణి దొడ్డికట .... తీసికెళ్ళండి! తొందరగా తీసికెళ్ళండి. లేకపోతే ఇక్కడే కూచుంటాడు. తర్వాత మీరే ఎత్తాలి. తర్వాత మీ ఇష్టం!" అని ఆ సమస్యని అతని ఇష్టానికే వదిలేసి, మళ్ళీ కుమారుడితో "నాన్నతోటే కడిగించుకోమ్మా! రా, రా — అని నన్ను పిలవకూ" అని మళ్ళీ బోధించింది.

ప్రసాద్ వొకటే ఆశ్చర్యపడిపోతూ — "ఏవిటీ, నువ్వు పిల్లాడి పని కూడా చెయ్యవా? అదీ ఇంటి పనేనా?" అని కొరకొరా చూశాడు.

అరుణ కించిత్తుకూడా బెదరకుండా — "ఆఁ.... అదీ ఇంటి పనే! పిల్లల్ని పెంచడం ఇంటి పని ఎందుక్కాదూ? ఇవాళ నేను ఏ పనీ చెయ్యను" అని మళ్ళీ చెప్పేసింది.

"చిన్నీ నీ పిల్లాడు కాడా?" అని భర్త గారు రెట్టించాడు.

"ఆరు రోజులే నా పిల్లాడు. ఆదివారం నా పిల్లాడు కాడు" అని భార్యకూడా రెట్టించింది.

పిల్లాడి మేనత్త ముందుకొచ్చి, "నేను తీసికెళ్తాను రారా! తొందరగా రా!" అని పిల్లాణ్ణి ఆహ్వానించింది.

వదినగారు కోపంగా — "రేఖా! నువ్వు తీసి కెళ్ళడానికి వీల్లేదు. ఆడవాళ్ళందరం ఒక కట్టుగా ఉండాలని చెప్పలేదూ?" అని అరిచింది.

"నాన్నా, తొందరగా రా నాన్నా!" అని పిల్లాడు తండ్రి ముందు గంతులేశాడు.

"సరే. చిన్నిగాడి దొడ్డిగోల కాబట్టి, ఈ ఒక్కపనే చేస్తాను. ఇంకో పని చేస్తానేమో చూడండి" — ప్రసాదు భీకర శపథం చేసి కదిలాడు — "పద వెధవా! అర్ధ రాత్రిదాకా మింగుతూనే ఉంటావు. లేచీ లేవగానే మొదలుపెడతావు. ఈసారి నించీ ఆది వారాలు కూడా 'దొడ్లోకి' అను, చెపుతాను. తొడ పాశం పెట్టకపోతే అప్పుడు చూడు!"

వెనకనించీ అరుణ కోపంగా హెచ్చరికలు చేసింది — "ఇదుగో, వాణ్ణి అలా విసుక్కుంటూ తీస కెళ్తే నేనొప్పుకోను. పిల్లల్ని పెంచడం అంటే అలాగేనా? విసుక్కోడాలూ కసరుకోడాలూనా? రోజూ నేను అలాగే పెంచుతున్నానా?"

"సరే. సరే, అలాగేలే. ముద్దులు పెట్టుకుంటూ దొడ్లోకి తీసికెళ్తాలే" అని వాగ్దానం విసిరాడు ప్రసాద్.

అప్పటికే వేణూ పాల సంచులు లోపలికి తీసుకు పోయి కాఫీ కార్యక్రమం మొదలుపెట్టేశాడు. తండ్రికి కాఫీ ఇచ్చి, టాబ్లెట్ ఇచ్చాడు. మిగిలిన అందరికీ గ్లాసుల్లో పోసి తెస్తూ — "కాఫీ! కాఫీ!" అని అరుస్తూ వొచ్చాడు. "నేను మొగాడినే కాబట్టి నేను చెయ్యొచ్చు .... పెద్దొదినా, తొందరగా తీసుకో! చిన్నొదినా, నువ్వు కూడా! వాసన్నయ్యా, నువ్వూ?" అంటూ పేరు పేరునా అందరికీ గ్లాసులు అందించాడు.

"బతికించావురా భగవంతుడా!" అని వాసు, ఆత్మలో ఒక దణ్ణం పెట్టుకున్నాడు.

కమల కాఫీ సువాసనలు పీలుస్తూ — "వేణూ! కాఫీ చేస్తే చేశావుగానీ, మిగతా పనులేవీ నువ్వు చెయ్యడానికి వీల్లేదు. నీకు వీలైనప్పుడల్లా చేస్తూనే వుంటావు కాబట్టి, నువ్వు కూడా మాలాగే సెలవు తీసుకోవాలి. తెలిసిందా?" అని మరిదిని హెచ్చరించి, భర్త గారితో — "ఇదిగో, వాసుదేవరావు గారూ! కాఫీ తాగడం అయ్యాక ఉప్మా పని మొదలుపెట్టండి" అని ఆజ్ఞ జారీ చేసింది.

"ఆఁ.... సరిగ్గా అదే అనుకుంటున్నా ఇప్పుడు. నీకు ఉప్మాలో అల్లం నచ్చుతుందా లేదా అని ఆలోచిస్తున్నా" అని వాసుదేవరావు కమలాదేవి మీద వీలైనంత వెటకారం గుమ్మరించాడు.

కమల ధీమాగా — "సరే! నేను చెప్ప వలిసింది చెప్పానూ, చెయ్యకపోతే అప్పుడే చూద్దాం" అని వేలు ముడి ఎగరేసింది.

"ఏం చేస్తారేమిటి?"

"ఏం చేస్తామో అప్పుడే తెలుస్తుంది."

"ఎప్పుడూ?"

"తమరు ఇంకా ఇక్కడే వేళ్ళాడినప్పుడు."

వాసుకి కొంచెం బెదురు ఎక్కువే. ఇతడు ప్రసాద్ అంత ధైర్యస్తుడు కాడు. "అరేయ్ వేణూ! ఈ ఉప్మాలూ గిప్మాలూ నా వల్ల కాదు గానీ, ఒక పని చెయ్యి! మనం ఎంత మంది ఉన్నాం? లక్ష్మితో కలిసి 10 మంది కదా? 10 ప్లేట్ల ఉప్మా, 10 ప్లేట్ల ఇడ్లీ తెచ్చెయ్యి! ఇదుగో, వంద రూపాయలు సరి పోతాయా? ఇక్కడున్నట్టు రావాలి" అని వంద నోటు కోసం చొక్కా జేబులో చెయ్యి పెట్టాడు గానీ అక్కడేమీ దొరకలేదు.

అన్నపూర్ణమ్మ సమయోచితంగా మళ్ళీ లబ లబలాడింది — "అయ్యో, అయ్యో' టిఫిన్లకి వంద రూపాయలు పెడతారా? తర్వాత భోజనాలకి వెయ్యి రూపాయలా అయితే? వొక్క ఆదివారం తోటే కొంప గుండం చేసేస్తారా ఏవిట్రా?" అని చిన్న కోడల్ని బేలగా చూసింది — "అమ్మా కమలా! ఆ రూపా యలు మీరే తీసుకుని.... ఏ జాకెట్టు గుడ్డలో కొనుక్కో వొచ్చు.... ఆ ఉప్మాయేదో మీరే చేసెయ్యరాదమ్మా?" అని సలహా ఇచ్చింది.

కమల ఎగిరి కంట్లో పడినంత పని చేసింది. "ఛీ ఛీ! డబ్బు తీసుకుని వంట మమ్మల్నే చెయ్య మంటారా?" అని అరిచింది. అంతలోనే చప్పున చల్లబడి — "మీరేం కంగారు పడకండి అత్తయ్యా!

హోటల్లో కొని తెస్తే మేం ఒప్పుకోం. రోజూ మేం కష్టపడి చెయ్యడం లేదూ? వాళ్ళూ అలాగే చెయ్యాలి" అంది.

"వాళ్ళే చేస్తారో, కొనే తెస్తారో, ఎలా చేస్తే మన కెందుకు కమలా?" అంది అక్కగారు.

కమల మొహం చాటుచేసి — "వాళ్ళ డబ్బు ఒకటీ, మన డబ్బు ఒకటీనా అక్కయ్యా?" అని గుస గుసలాడింది.

"నీ పిచ్చిగానీ వాళ్ళ దగ్గిర అసలు డబ్బెక్కడుంది? ఇద్దరి జీతాలూ కలిపి తిప్పి తిప్పి కొడితే నాలుగు వేలన్నా ఉండదు. ఎన్నాళ్ళు కొంటారో అదీ చూద్దాం" అంది అక్కగారు.

కమలకి కూడా 'అదీ చూద్దా'మనిపించింది. "మరి అదేదో తొందరగా తెప్పించండి! అప్పుడే ఎని మిది కావస్తోంది. మేమైతే, ఏడు గంటలకే అల్పా హారాలు వేడి వేడిగా అందించడం లేదూ?" అని గంటల లెక్కలు చెప్పింది.

చిన్ని ఒచ్చి మళ్ళీ తల్లిని పట్టుకున్నాడు. "అమ్మా ...... ఆకలేస్తోంది ...... ఏవన్నా పెట్టు ...... అమ్మా ...... ఏవన్నా పెట్టు ......" అని చేతులు పట్టుకుని వేళ్ళా డాడు.

అరుణ అనునయంగానే — "మళ్ళీ నా దగ్గిర కెందుకొచ్చావు నాన్నా? ఇవాళ ఆదివారం అని చెప్పాను కదా?" అని గుర్తు చేసింది.

"ఆదివారం కూడా ఆకలేస్తోందిగా?"

"ఆ సంగతి మీ నాన్నకి చెప్పు. నిన్ను ఇవ్వాళ నాన్నే పెంచాలి. మళ్ళీ రేపటి నించీ నేను పెంచు తాను."

"ఊహూఁ ....... నాన్న ఒద్దు. నువ్వే పెంచు నన్ను. నాన్న తొడపాశం పెడతాడంట!"

"చూశావా, పిల్లాడెంత బెదిరిపోయాడో!" అని అరుణ తోడి కోడలి వేపు సానుభూతి కోసం చూసి, మళ్ళీ పిల్లాణ్ణి బుజ్జగించింది — "నాన్న నిన్నేమన్నా అంటే నేనూరుకుంటానా? పోట్లాడనూ? ...... బంగారు కొండవి కదా? చెప్పినట్టు వినాలి! అమ్మకి ఆదివారం అక్కరలేదా, నువ్వే చెప్పు! ఇవ్వాళ నాన్న తోటే నీళ్ళు పోయించుకో. నాన్న తోటే అన్నం పెట్టించుకో. అన్నీ నాన్న తోటే! సరేనా?"

"ఊహూఁ ...... నాయనమ్మతో చేయించు కుంటా."

"ఒద్దమ్మా! నాయనమ్మకి కూడా సెలవే కదా? ఏం, నాన్న దగ్గిరికే వెళ్ళు."

చిన్నిగాడు బిక్కమొహంతోటే నాన్న దగ్గిరికి నడిచాడు — "నాన్నా! ఆకలేస్తోంది నాన్న! యావన్నా పెట్టు!"

"మా బాబే, మా నాయనే! లడ్డుండలు పెడతా నమ్మా! చేస్తానుండు!.... ఆకలట, ఆకలి! దిగుమతి అయ్యిందిగా, ఇక ఎగుమతీ!" అని కుమారుడి మీద కళ్ళెర్రజేశాడు తండ్రిగారు.

అరుణ — "అలా వాణ్ణి వెటకారాలు చెయ్యొద్దని చెప్పానా లేదా?" అని కోపంగా అడిగింది.

"నా ఇష్టం! నేను పెంచేటప్పుడు నా ఇష్టం ఒచ్చి నట్టు పెంచుతాను. తిడతాను, కొడతాను. గోడ కుర్చీలు వేయిస్తాను. నానా చిత్రహింసలూ పెట్టేస్తాను. అదంతా నా ఇష్టం! నా పెంపకం నీకు నచ్చకపోతే నువ్వే పెంచుకో!" అని జవాబు చెప్పాడు తండ్రి.

"ఓహో! మీ ఎత్తు తెలిసింది! సరే, అలాగే పెంచండి! ఎవరి పెంపకం బాగుందో వాడే గ్రహిస్తాడు. అలాగే పెంచండి!" అని దానికీ సిద్ధపడింది అరుణ.

కమల, బావగారి మీద మండిపడుతూ "ఇవ్వాళ మీరు వాడికి గోడకుర్చీలూ తొడపాశాలూ ప్రసాదిస్తే, రేపు మీకు వయసుమళ్ళాక మీకూ వాడు అవే అప్ప జెపుతాడు. అది తెలుసుకోండి!" అని చేతులు తిప్పింది.

"రారా చిన్నా, పాలు తాగుదువుగాని, నేని స్తానురా" అని మళ్ళీ ముందుకొచ్చింది మేనత్త, పిల్లాణ్ణి చూడలేక.

"రేఖా! ఎన్నిసార్లు చెప్పాలి నీకు?" అని వదిన గార్లిద్దరూ చెరోపక్కనించీ అరిచారు.

అన్నపూర్ణమ్మ, తన పాత్రని మరిచిపోకుండా "ఇదుగో ఇదీ వరస, తెల్లారిం దగ్గిర్నించీ!.... నాయనా వేణూ! సైకిల్ మీద తొందరగా వెళ్ళి అదేదో తెచ్చిపడెయ్యి! పిల్లాడు ఆకలితో వేళ్ళాడిపోతున్నాడు. మీ నాన్న కూడా ఆకలికి ఎక్కువ సేపు ఉండలేరు" అని చిన్న కొడుకుని తొందరచేసింది.

వేణు మళ్ళీ లేచి వంటింట్లోకి సిద్ధమవుతూ

"ఉప్మా కూడా నేనే చేసేస్తాలేమ్మా! మిగతావన్నీ అన్నయ్యలు చేస్తార్లే.... పెద్దొదినా! చిన్నొదినా! మిమ్మల్ని చూస్తే ఎంత నవ్వొస్తోందో!" అని మొహం మీద నవ్వు మెరిపించాడు.

"ఎందుకటా అంత నవ్వూ?" అని రుసరుసలాడారు వదినలు.

"ఎంత నమ్మకమో కదా మీకు ఈ 'చట్టాల' మీద?"

"చట్టాల్ని కాకపోతే దేన్ని నమ్ముతాం?"

"వరకట్నం చట్టం పని చెయ్యడం ఒక్క కేసులోనన్నా చూశారా?"

"అందుకని ఆ చట్టమే వొద్దంటామా?"

"అసలు చట్టం అంటే, ఏ పనికి చట్టం సాధ్యమో, ఏ పనికి కాదో; ఆ తేడాయే లేదా మీకు? అమలు జరగడానికి సాధ్యంకాని చట్టాలు ఉంటే, వాటివల్ల ఏమిటి ప్రయోజనం?"

"అంత సాధ్యమే కాని చట్టాల్ని గవర్నమెంటు ఎందుకు చేస్తుంది? చట్టం అంటూ ఉంటే, ఎంత పనికిమాలిన చట్టానికైనా దాని విలువ దానికి ఉండక పోదు."

"గవర్నమెంటు ఏదన్నా చట్టం చేసినా, దాన్ని దాటిపోయే దారులన్నీ కూడా అందులోనే ఇరికిస్తుంది. మీకు తెలుసో లేదో!"

"అఁ.... నీకు తెలిసిందిలే మహా"

"సరే, సరే. నేను ఉప్మా చేసుకోవాలి బాబూ!" అనేసి వేణూ వదిన గార్లతో వాదం కట్టిపెట్టి వంటింట్లోకి పరిగెత్తాడు.

అరుణ, భర్తగార్ని పిలుస్తూ— "ఇదుగో మిమ్మల్నే. వంటకి ఆలస్యమై పోతోంది. మీరు వెళ్ళి బెండకాయలు తరుక్కోండి!" అంది.

"నేనా! బెండకాయలా? నే నింత వరకూ బెండకాయ కూరని తప్ప బెండకాయల్ని చూడనేలేదు. గుండ్రంగా గచ్చ కాయల్లా ఉంటాయి. అవేనా బెండకాయలంటే?"

"గచ్చకాయ లెప్పుడు చూశారు?"

"చిన్నప్పుడు చూశాలే!"

"గచ్చకాయలు చూశారుగానీ, బెండకాయలు చూళ్ళేదా? సరే, వంటింట్లో బుట్టలో ఉన్నాయి బెండకాయలు, చూడండి వెళ్ళి."

"అలాంటి ఆశలు పెట్టుకోకు నా మీద! కలలూ ఊహలూ అవీ పెట్టుకోకు!"

అరుణ తెల్లగా తెల్లబోయింది. "మరి మేం సెలవు తీసుకోవద్దూ?"

"తీసుకోండీ. ఎవరొద్దన్నారూ? మహారాణుల్లా తీసుకోండీ!"

"మరీ, మీరు పని చెయ్యొద్దూ?"

"చెయ్యం! చెయ్యం! చెయ్యం!"

"మీరు పని చెయ్యకపోతే మేం సెలవు తీసుకోడం ఎలాగ?" — కమల సూటి ప్రశ్న.

"ఏమో, ఎలాగో! మమ్మల్నడిగితే మేమేం చెపుతాం? మీకు సెలవు ఎవరిచ్చారో వాళ్ళని అడగండి! మీ సెలవు పప్పులు మా దగ్గిర వుడకవ్."

"మా సెలవు పప్పులా?"

"అఁ.... సెలవు పప్పులే. అంతేకాదు. చట్టం పప్పులు కూడా!"

"అఁ.... చట్టం పప్పులు కూడానా?"

"అఁ.... దేని పప్పులూ మా దగ్గిర వుడకవ్. ఆదివారం లేదు, గీదివారం లేదు. సెలవు లేదు, గిలవు లేదు. రోజూలాగే.... మీరే చక్కగా పనులన్నీ చేసుకోండి! కావాలంటే సాయంత్రం సినిమాకి వెళ్దాం!"

తోటికోడళ్ళిద్దరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటూ వుండిపోయారు. ఎవరికీ నోట మాట లేదు.

"పూర్ణక్కయ్యా!.... అరుణా! వాసూ! ప్రసాద్!.... అరె, వొక్కరూ పలకరే!" అంటూ ప్రవేశించాడు హనుమంతరావు. దాదాపు నలభయ్యేళ్ళ వయసు ఉంటుంది. పంచెకట్టూ, చొక్కా, పైపంచీ, వేళ్ళకి ఉంగరాలూ, బుగ్గన వక్కపొడీ! పెళ్ళిళ్ళకూ, విందులకూ, ఉత్సవాలకూ బయట వంటలు చేస్తూ వుంటాడు. అదే ఆయన ప్రధాన వృత్తి. "అందరూ ఇలా నించున్నారేమిటి? ఫొటోకా? నేనూ నించోనా?" — ఆ జోకు ఆయన వాసు దగ్గిర్నించే నేర్చుకున్నాడు.

"రా మావయ్యా! మంచి టైంకే వొచ్చావు" అని మొదట ప్రసాద్ ఆహ్వానం పలికాడు.

"మంచి రసకందాయంలోనే వొచ్చావు హనుమంతూ" అంది అన్నపూర్ణమ్మ.

"రసకందాయం ఏమిటి? ఏవన్నా పాయసం

చేస్తున్నారా?" అని సంతోషించాడు హనుమంతు.

"ఎవరూ చేసేదీ? ఆడవాళ్ళు పనులు కట్టిపెట్టి కూచున్నారు. మొగాళ్ళు 'మేం అంతకన్నా చెయ్యం' అంటున్నారు. ఇంకెవరూ పాయసాలు చేసేదీ?" అని దీర్ఘం తీసింది అన్నపూర్ణక్కయ్య.

"సరిపోయింది. అయితే ఇక్కడా మా కతే నడుస్తోందన్నమాట!" అని ఉసూరుమన్నాడు హనుమంతు.

"అంటే? మీ ఇంట్లోనూ ఈ కతేనా?" — అన్ని కంఠాలూ!

"సరిగ్గా ఈ కతే. ఇవ్వాళ ఆడవాళ్ళకి సెలవు రోజట కదా? శకుంతల చీకట్నే లేపేసి చావగొట్టి చెవులు మూసింది. తను ఏ పనీ ముట్టుకోదట! నేను మొదట అల్పాహారం చేసి, తర్వాత పూర్ణాహారం చేసి, అటెనక ఆవిడ చీరలుకూడా ఉతికి.... అవన్నీ చెయ్యాలట! ఇప్పటిదాకా వాదించి వాదించి 'సరే, వొస్తానుండు' అని ఇలా తప్పించుకొచ్చా. మధ్యాన్నం వెళ్తే సరి. తనే వొండి ఉంచుతుంది. లేకపోతే.... పూర్ణక్కయ్యా! ఎన్నడన్నా విన్నామా? ఆఫీసులకీ, కంపెనీలకీ సెలవు లుంటాయిగానీ ఇంట్లో పనికి సెలవేమి టక్కయ్యా?"

"అవుననుకో, పోనీ వంట చేతనైన వాడివేగా? నీ చేతిలో పనీ, ఆవిడ ఏదో అడిగింది. చేసెయ్యక పోయావా?.... మా వాళ్ళంటే, పని చేతగాక మిడుకుతున్నారుగానీ...." అని పూర్ణక్కయ్య తనకు తోచిన సబబు తను చెప్పింది.

"అదేం టక్కయ్యా! పెద్ద దానివి. నువ్వుకూడా అలాగంటావు? బైట వంటలు చేస్తాను కదా అని, ఇంట్లో ఆడదాన్ని కూర్చో బెట్టి నేను వంట చెయ్యనా? ఏ రోగమో రొష్టో వొస్తే తప్పదుగానీ."

"అయ్యో! ఈ మాత్రం పనికి రోగాలూ రొష్టులూ రావాలా హనుమంతూ?"

"రోగాలంటే రోగాలే కాదనుకో" అని హనుమంతు మాట సర్దుకున్నాడు.

"అది కాదయ్యా! ఆ గవన్నమింటింగు వాళ్ళేదో అన్నారని వీళ్ళందరికీ తిక్క రేగింది. రెండు వారాల పాటు మాట్లాడకుండా వొండి పడేస్తే వాళ్ళకి ఆ పట్టుదలపోతుంది. తర్వాత వాళ్ళే దారికొస్తారు. ఈ చట్టాలూ పిట్టాలూ ఎల్లకాలం సాగుతాయా? పోనీ కాఫీ అన్నా కాచి పెట్టావా?" అంటూ అన్నపూర్ణమ్మ కాఫీ క్షేమ సమాచారాలడిగింది.

"అమ్మో! రెండు వారాలు వొండితే, 'ఇదే బాగుంది, ఇలాగే చెయ్య'మంటారు. నువ్వెన్ని చెప్పు అక్కయ్యా! ఇంట్లో వంటా వార్పూ ఆడవాళ్ళ నాజూకు చేతుల్తో చేస్తే అదెంత అందం! వంటింట్లో ఆడవాళ్ళు తిరిగితేనే ముద్దూ ముచ్చటా! ఎక్కడ ఉండవలసిన వాళ్ళు అక్కడ ఉండాలి!" అంటూ హనుమంతు తన కోసం ఒక కుర్చీ సంపాదించుకుని తొందరగా కూర్చున్నాడు, తను ఎక్కడ ఉండాలో చూపిస్తూ.

కమల వెటకారంగా నవ్వి — "ఓహోహో! బాబాయిగారూ! మీ చేతుల్తో పొయ్యిమీద పప్పు పెడదాం పదండి, ఉడుకుతుందో, లేదో చూద్దాం" అంది.

"ఎందుకు ఉడకదులేమ్మా! పప్పుని తీసుకుపోయి నిప్పుల మీద పడేస్తే.... దాని ప్రాణం ఎంతా, అదెంతా? ఉడక్క చస్తుందా?" అని, ఉడుకుతుంది లెమ్మని హనుమంతే వొప్పేసుకున్నాడు.

"మరిహనేం? మొగాళ్ళ చేతుల్తో కూడా అన్నీ ఉడుకుతాయి. ఆడ వాళ్ళే వంటలు చెయ్యాలని రూలేమిటి?" అని పాయింటు తీశారు తోటి కోడళ్ళు.

"అబ్బా, రూలు కాదర్రా! వంట పని ఆడ పిల్లలకి చప్పున పట్టు పడుతుంది. మొగాళ్ళకి ఎంతకీ వొచ్చి చావదు" అని హనుమంతు మరీ వెనక్కిపోయి ఇక్ష్వాకుల వాదం తీసుకొచ్చాడు.

అక్క చెల్లెళ్ళిద్దరూ దాన్ని చాలా తేలిగ్గానే ఎగరగొట్టారు — "ఆడ పిల్లలు అమ్మల కడుపుల్లోంచి వంట గిన్నెలతోటే పుట్టుకొచ్చారా? మీరెలా పుట్టారో మేమూ అలాగే పుట్టాం. పుట్టాకే వంటలు నేర్చుకున్నాం. నేర్చుకుంటే ఏ పని అయినా వొస్తుంది. ఏ వయసులో అయినా వొస్తుంది" అనేశారు వాళ్ళు గబగబా.

"అమ్మాయ్! మీరిలా ఈకకి ఈకా తోకకి తోకా పీకి మాట్లాడితే, ఆడవాళ్ళ అందమే పోతుంది.... మొగాళ్ళుకూడా వొండితే వొండుతారేమోగానీ ఆడ వాళ్ళు వొండినప్పుడు వుండే ఆ రుచీ.... ఆ పరిమళం .... ఆ అందం.... అవన్నీ ఉండేడుస్తాయా?" అన్నాడు హనుమంతు కొత్త పాయింటు తెచ్చాననుకుంటూ.

ఎప్పుడూ ఎక్కువగా మాటాడని రేఖకి కూడా వాదన వేసుకోవాలని సరదా పుట్టింది — "అదేవిటి మావయ్యా! 'నల భీమ పాకం' అని మొగాళ్ళ పేర్లతోటే చెపుతారుగా? పెళ్ళిళ్ళకీ, వాటికీ మొగాళ్ళే వొండు తారుగా? హోటళ్ళలో, స్వీటు షాపుల్లో ఎవరు వొండు తున్నారు? ఇళ్ళల్లో కన్నా అవే ఎంతో రుచిగా ఉంటాయి. కావాలంటే ఎవరినన్నా అడుగు" అంది నవ్వుతూ.

"సరిగ్గా మీ అత్తయ్య కూడా ఇలాగే వాదనేసు కుంది. మొగాళ్ళ వంటలే రుచిగా ఉంటాయంది."

"నేనలా అనడం లేదు. 'మొగాళ్ళ వంటలు రుచిగా ఉండవు' అంటే, అది తప్పంటున్నాను. సరిగా నేర్చుకుని సరిగా చేస్తే ఎవరు చేసినా రుచి వొస్తుంది. సరిగా చెయ్యకపోతే ఎవరు చేసినా రుచి రాదు. మనిషి మనిషికీ తేడా ఉంటే ఉండొచ్చు. అది వేరనుకో."

"అబ్బా! రుచి సంగతి కాదమ్మా!" అని, ఆ పాయింటు చప్పున వదిలేశాడు హనుమంతు. అటెనక — "కుడి చెయ్యీ, ఎడం చెయ్యీ అని లేదంటారా?" అనేశాడు గబుక్కున.

"ఆడవాళ్ళు ఎడం చేతులా?" అని తీక్షణంగా చూసింది రేఖ.

"అబ్బా! అది కాదమ్మా" అని కొంచెం జంకి, ఆ మాట కూడా మార్చాడు. "ఒక్కమాట చెపుతా వినండి! 'భారత సంస్కృతి' అనే మాట ఎప్పుడన్నా విన్నారా? దాని గొప్పతనం గురించి ఎప్పుడన్నా చదివారా? ఆడవాళ్ళంటే.... అణకువగా.... వినయంగా.... ఒద్దికగా .... ఆఁ.... అలా ఉంటే అందంగానీ.... 'నువ్వెంత అంటే నువ్వెంత' అనుకుంటూ, 'ఛీ, బబ్బా'మని ఎదురు తిరిగితే అదో గొప్పా? ఎబ్బే, ఏవిటో మీరూ...." అని అసలు ఉద్దేశం బైట పెట్టేశాడు హనుమంతు మామయ్య.

రేఖ శాంతంగానే నవ్వింది. "అవన్నీ నాకు తెలీవు గానీ మావయ్యా, 'భారత సంస్కృతి' అంటున్నావు. మరి భారత ప్రభుత్వమే కదా ఈ సెలవు సంగతి తెచ్చింది? ఇరాన్ ప్రభుత్వమో, అరబ్బు ప్రభుత్వమో కాదు గదా?" అంది.

అరుణా, కమలా చప్పట్లు కొట్టి "రేఖా, రేఖా! ఎంత బాగా చెప్పావో!" అని ఆడ బిడ్డని తెగ మెచ్చు కున్నారు.

హనుమంతు బాగా ఉక్రోషపడ్డాడు. "ఆఁ .... ప్రభుత్వం ఇవ్వాళో మాట అంటుంది, రేపో మాట అంటుంది. దానికో వరసా వాయీ ఉంటేనా? సరే, కానివ్వండి! ఇదెన్నాళ్ళో అదీ చూద్దాం! మొగాళ్ళ మొహాన్న ఏం రాసి పెట్టి ఉంటే అదే జరుగుతుంది" అని వాదం కట్టిపెట్టేశాడు మామయ్య.

వాసు తెల్లమొహం వేసి— "అదేవిటీ మావయ్యా, భలేగా వాదిస్తున్నావని మేం సంతోష పడిపోతోంటే, హఠాత్తుగా వెన కడుగు వేసేశావేమిటి?" అని ఏడుపు మొహం పెట్టాడు.

"ఏం చేస్తాంరా? గవర్నమెంటు, ఆడ వాళ్ళ పక్షాన ఉంది. అదీ వాళ్ళ ధైర్యం! చూద్దాంలే ఇదెన్నాళ్ళో!"

"ఉప్మా! ఉప్మా! ఉప్మా అండీ!" అని వేణు హఠాత్తుగా ఉప్మా ప్లేట్లతో ప్రవేశించాడు. "కరివేపాకూ అల్లం వేసిన ఉప్మా! తీసుకోండి అందరూ!" అంటూ అందరికీ చకచకా అందించాడు, హనుమంతుకి తప్ప! "మామయ్యా! నీకు వంట చెయ్యడం చక్కగా వొచ్చి కూడా అత్తయ్య కోసం వొక్క పూటన్నా ఏమీ చేసి పెట్టకుండా ఇలా తప్పించుకొచ్చావు. అందుకని, నేను చేసింది నీకు పెట్టను" అని నిర్మొహమాటంగా చెప్పే శాడు.

"ఏవిటోయ్, ఆడవాళ్ళని మహా వెన కేసుకొస్తు న్నావు. రేప్పొద్దున్న పెళ్ళయ్యాక వొక్కపూటేం ఖర్మ, అన్ని పూటలూ నువ్వే వొండిపెట్టు పెళ్ళాన్ని కూచో బెట్టి" అని వెటకారంగా నవ్వి సంతోషపడ్డాడు హనుమంతు.

వేణు తన పని తను చేస్తూనే — "ఒకరు ఇంకొ కరికి చేసి పెట్టడం కాదు, ఇద్దరూ ఇద్దరికీ చేసు కోవాలి. ఒక్కరోజు కాదు, అన్ని రోజులూ ఒక్కలాగే చేసుకోవాలి. మా వదినలిద్దరికీ అర్థం కానిది అదే" అన్నాడు.

వదినలిద్దరూ వెటకారంగా నవ్వారు — "ఆహా!.... వొక్కరోజు చెయ్యమంటేనే మన్నూ మిన్నూ ఏకం చేస్తున్నారు. ఇక రోజూ చెయ్యమంటే.... అయినట్టేలే" అని మరిది మాటలు ఎగరగొట్టారు.

వేణు వదిలి పెట్టలేదు — "అసలు మీ సమస్య

మీకు అర్థమైతే అన్నీ సవ్యంగానే జరుగుతాయి. పెద్దన్నయ్య ఎప్పుడన్నా వంటింట్లోకి వొస్తే పెద్దొదిన ఏమనేది? 'మీరెందుకూ ఇక్కడా, వెళ్ళండి' అనేది. నే నెప్పుడన్నా పొయ్యి దగ్గర కూర్చుంటే, మీరిద్దరూ ఏమనేవారు? 'ఏమిటి వేణూ, ఎప్పుడూ ఆడంగి సింగడిలాగా వంటింట్లో తిరుగుతావూ' అనేవారు. అవునా, కాదా?" అని గతం గుర్తు తెచ్చుకోమన్నాడు వదిన లిద్దర్నీ.

"అదంతా ఎప్పుడో! తెలీక అలా అన్నాంగానీ ఇప్పుడు అంటున్నామా?"

"ఇప్పుడు మాత్రం మీకు తెలిసింది ఎంత? మీ సమస్యే మీకు అర్థం కాలేదు."

వేణు మీద హనుమంతుకి వొళ్ళు మండి పోతోంది. కనీసం తనకి కూడా ఉప్మా పెడితే ఆ రౌద్రం కొంత తగ్గేదే. చేతనైనంత వెటకారంగా "వేణు మహా ఆదర్శవంతుడై పోయాడండీ! ఎవత్తి వస్తుందో గానీ కాలు కింద పెట్టక్కర్లేదు. ఈయనే వంట చేస్తాడు. ఈయనే ఆ పిల్ల చీరలన్నీ ఉతుకుతాడు...." అని నవ్వాడు.

వేణు శాంతం తెచ్చి పెట్టుకున్నాడు "చీరలు ఉతకడం అంటే అంత చిన్న చూపా మావయ్యా? మా అమ్మ చీరలు ఉతకాలంటే నాకు కష్టంగా ఉంటుందా? భార్య చీరలైనా అంతే. కలిసి బతికే ఆడ వాళ్ళ బట్టలు ఉతకడమే అంత తప్పు పని అయితే, మరి చాకళ్ళు, తరతరాల నించీ ఊళ్ళో అందరి పెళ్ళాలకీ, అందరి పిల్లలకీ, పురిటి గుడ్డలతో సహా, పీతి గుడ్డలతో సహా, తెగుళ్ళ గుడ్డలూ, రోగాల గుడ్డలూ, మూటలు మూటలు మోసుకుపోయి ఉతుకుతూనే ఉన్నారే! వాళ్ళు మనుషులుకారా? మొగవాళ్ళు కారా? అంత తప్పు పని వాళ్ళకెలా అప్పజెపుతున్నారు మీరందరూ?" అన్నాడు.

"ఇది మరీ బాగుంది! వాళ్ళ వృత్తి అదీ!"

"ఆఁ.... వృత్తే! వాళ్ళ మీదకి గెంటేసిన వృత్తి! చూస్తూ ఉండండి! ఆ వృత్తులే ఎదురు తిరుగుతాయి. అన్ని వృత్తులూ తారుమారవుతాయి. ఆడ పనులూ, మొగ పనులూ అన్నీ ఏకం పాకం, అవుతాయి. ఎప్పుడూ ఇలాగే ఉండదు."

రేఖ — "వేణన్నయ్యా! మావయ్యకి కూడా కొంచెం ఉప్మా పెట్టు! ఎంత రుచిగా చేశావో చూస్తాడు" అంది.

వేణు తిరస్కరించాడు — "కావాలంటే రేపు చేసి పెడతాను. ఇవ్వాళ మాత్రం పెట్టను. ఇవ్వాళ పెట్టి, ఆడవాళ్ళ పోరాటాన్ని అవమానించను, అది ఎంత తెలివి మాలిన పోరాటం అయినా సరే! అమ్మో.... స్టౌ మీద పాలు! నాన్నకి మళ్ళీ కాఫీ!" అంటూ వంటింట్లోకి పరిగెత్తాడు.

అప్పటికి ప్రసాదూ, వాసూ ఓ మూలకి చేరి, గుస గుసలు జరుపుతున్నారు.

"అన్నయ్యా! పోనీ మావయ్యని సాయం పెట్టు కుని ఆ వంటేదో చేసి పారేద్దామా? ఉప్పెక్కు వేసేద్దాం. వాళ్ళ తిక్క కుదురుతుంది" అని తమ్ముడు గొప్ప మార్గం సూచించాడు.

"ఉప్పెక్కువేస్తే మనమెలా తింటాం?" అన్నగారి సందేహం!

"మనకి వేరే గిన్ని పెట్టుకుందాం."

"అమ్మకీ, నాన్నకీ?"

"మనందరికీ వేరే గిన్ని! ఆ అక్క చెల్లెళ్ళిద్దరికీ ఉప్పెక్కువ గిన్ని."

"మీ గిన్నిలో ఉప్పెక్కు వేశాం, మీరు ఆ గిన్నలోదే తినండి, మా గిన్ని ముట్టు కోకండి— అంటే, వాళ్ళెం దుకు తింటారు?" అని సందేహించాడు అన్న.

"ఏం, ఎందుకు తినరూ? మనం వంట చేసి నప్పుడు మన ఇష్టం వొచ్చినట్టు వొండుతాం. ఎవరి కోసం ఎంత ఉప్పు వెయ్యాలనిపిస్తే అంత వేస్తాం. మన ఇష్టమా, వాళ్ళ ఇష్టమా? ఆఁ.... గుర్తొచ్చింది. వడ్డన కూడా మనమే చెయ్యాలిగా? వాళ్ళకి ఉప్పుకూరే వేద్దాం" అని వాదించాడు తమ్ముడు. "నువ్వు చిన్నిని తొడపాశాలతో పెంచుతానన్నావుగా? అలాగే ఉప్పెక్కువేసి వొండుతాం వాళ్ళకి. అది మన ఇష్టం!" అని అన్నని వొప్పించాలని మళ్ళీ మళ్ళీ ప్రయ త్నించాడు.

"అదేం కుదరదులే. వాళ్ళా గిన్ని తెచ్చి మన అన్నాల్లో దిమ్మరించి, మన గిన్ని లాక్కుంటారు. వాళ్ళసలే మాంచి కోపం మీద ఉన్నారు."

"అబ్బా. ఎలాగ మరి? అన్నీ అడ్డాలే" అని ఏడుపు మొహం పెట్టాడు తమ్ముడు.

హఠాత్తుగా "మీరిక్కడున్నారా?" అంటూ ప్రవేశిం చింది శకుంతల, హనుమంతు గారి ఆవిడ. పెళ పెళ

లాడుతోన్న ఆకు పచ్చ నేత చీరా, ముడిచుట్టూ పూల దండా, పెద్ద బొట్టూ.... ఆదివారం సెలవు ముస్తాబు ఉత్సాహంగానే చేసుకున్నట్టు కనపడుతోంది. "'ఇదుగో, వస్తాన'ని చెప్పారు. ఏ పేపరు తెచ్చు కుంటారో, వక్క పొడి తెచ్చుకుంటారో.... ఇంకా వొస్తారు, ఇంకా వొస్తారు — అని ఎదురు చూస్తు న్నాను. ఇక్కడ కూచున్నారా?" అంది భర్తగార్ని మింగేసేలా చూస్తూ.

శకుంతలకి వాళ్ళాయన ఇక్కడైనా దొరికాడు. కామేశ్వరికి అయితే, రాత్రి షిఫ్టుకి పోయినవాడు తెల్లారి ఇంటికి రావాలా? "సోమవారం పొద్దున్న దాకా రానని" కబు రంపాడు. "మరి నేను సెలవు ఎలా తీసు కోనూ?" అని కామేశ్వరి ఊఁ.... ఇదవుతోంటే శకుం తలే ధైర్యం చెప్పి, "ఇవ్వాళ నువ్వే వొండేసుకో. రేపు మీ ఆయన రాగానే సెలవు తీసుకో. అతని రోగం అలా కుదురు్చ" అని సలహా ఇచ్చి ఇలా వచ్చింది. రాగానే ఆ సంగతి ఇక్కడ కూడా చెప్పింది — "కామే శ్వరి ఊఁ.... ఇదవుతోంటే ధైర్యం చెప్పి వొచ్చాను" అని.

"అవును మరి, అందరికీ ధైర్యాలు చెప్పే ధైర్యస్తు రాలివి కదా నువ్వు?" అని హనుమంతు కొరకొర లాడాడు.

"ఏం, ధైర్యస్తురాల్ని కాక?" అని, శకుంతల తన ధైర్యాన్ని ప్రదర్శిస్తూ — భర్తగార్ని సూటిగా అడిగేసింది. "వారానికి ఒక్కరోజు వంట చెయ్యడానికి అంత చిన్న తనంగా ఉందా?.... ఇంతకీ ఇంటికొచ్చి నాకు కాఫీ ఇస్తారా, లేదా?" తేల్చమంది.

అందరూ నవ్వారు — 'ఇంకా కాఫీ తాగలేదా' అని!

"అప్పుడే తొమ్మిది దాటింది. రోజూ ఈ పాటికి రొండుసార్లు తాగే దాన్ని. ఏ అట్టో పిట్టో చేసుకుని కడుపునిండా తినేదాన్ని. ఏనాడన్నా మిమ్మల్ని తొమ్మిది గంటలదాకా కాఫీ ఇవ్వకుండా ఉంచానా?" అంది భర్తగార్ని కొరకొర చూస్తూ.

"ఇవ్వాళ ఉంచావుగా?" అన్నాడు హనుమంతు పళ్ళు నూరుతూ.

అన్న పూర్ణమ్మ నోరు తెరిచేసి బుగ్గలు నొక్కుకుని — "శకుంతలా! నీ పిచ్చిగానీ.... కాళ్ళూ చేతులూ లేని దానిలాగా అతను చేసి ఇవ్వడమేమిటే? హాయిగా నువ్వే చేసుకుని తాగకూడదూ?" అంది. బుగ్గలు అలాగే బంధించి బంధించి వాటిని అలాగే సొట్టలు చేసేసుకుంది అన్నపూర్ణమ్మ.

వేణు గబగబా వంటింట్లోకెళ్ళి ప్లేటుతో ఉప్మా తెచ్చి శకుంతలకి ఇస్తూ "నేనే చేశాను అత్తయ్యా!" అన్నాడు. శకుంతల నవ్వింది. "ఈపూట మీ మామయ్య వండితేనే తింటాను" అంది. అన్న పూర్ణమ్మకి జవాబు చెప్పినట్టు — ".... నేనెందుకు చేసుకోవాలీ? ఆడవాళ్ళకి సెలవా, కాదా?" అని మళ్ళీ భర్తగార్ని కొరకొరా చూసింది— "ఏవిటీ, మాట్లాడరేం? ఇంటికి వొస్తారా, రారా?" తేల్చెయ్యమంది తొందరగా.

"వొస్తాను. కానీ వంట చెయ్యను."

"ఏం, ఎందుకు చెయ్యరూ?"

"ఇంట్లో వంట ఆడవాళ్ళే చెయ్యాలి."

"అలా అని ఎక్కడుందీ?"

"వేదాల్లో రాశారు."

"ఏదీ చూపించండీ!"

"చూపిస్తా! ముందు వంట చెయ్యి. తినేసి, ఓ కునుకు తీసి లేచి చూపిస్తా."

"పోనీ రాశారే అనుకుందాం. మరి నిన్న పత్రికల్లో ఆడవాళ్ళ సెలవు గురించి రాశారుగా?"

"ఏమో, వేదాల్లో సెలవుల సంగతి లేదు. వేదాలు ముందు పుట్టాయా, పత్రి కలు ముందు పుట్టాయా?"

"వేదాల కాలంలో పుట్టిన వాళ్ళకి వేదాలూ, పత్రి కల కాలంలో పుట్టిన వాళ్ళకి పత్రికలూ! అంతేకదా?"

"అంతే కాదు. నేను వేదాల కాలంలోనూ, నువ్వు పత్రికల కాలంలోనూ ఉంటే, మన సంసారం ఏ కాలంలో ఉంటుంది?" అని ఉరిమాడు హను మంతు.

శకుంతల రకీమని — "పోయే కాలంలో ఉంటుంది" అని జవాబు చెప్పేసింది.

"అబ్బబ్బబ్బ! నిన్నటినించీ తల పెట్లిపోతోంది" అని హనుమంతు తల పట్టు కున్నాడు.

అనుకోకుండా చుట్టాలు వొచ్చే శుభ శకునాలు కనపడ్డాయి. ఇంటి ముందు ఆటో ఆగిన చప్పుడైంది.

కొందరు అటు పరిగెత్తారు.

"చుట్టాలేమో అక్కయ్యా!" అంది కమల

భయంగా.

"చుట్టాలా? ఇప్పుడొచ్చి ఏం తింటారూ?" అని అన్నపూర్ణమ్మ దీర్ఘం తీసింది.

వాసు ఎగిరి గంతేసి "చుట్టాలా? రానివ్వండి, రానివ్వండి! ఆడవాళ్ళేనా? వంట చేస్తారు" అని మళ్ళీ గంతేశాడు.

కమల అభ్యంతరం తెలిపింది "ఆడ చుట్టాలతో వంట చేయిస్తే మేం ఎందుకు ఒప్పుకుంటాం? వాళ్ళకీ సెలవేగా?"

"ఇది మరీ బాగుంది. మేం చేస్తే మీకెందుకు, చేయిస్తే మీకెందుకు?" అని ఎదురు తిరిగాడు వాసు. కానీ అతని ఆశలన్నీ నిరాశలు చేస్తూ ఆటో వెళ్ళి పోయింది.

రేఖ లోపలికొస్తూ — "మనింటికి కాదు. వేప చెట్టు ఇంటివాళ్ళు ఎక్కడికో వెళ్తున్నారు" అంది.

"ఇంకెక్కడికి? మనలాగే కుమ్ములాడుకుని ఏ హోటల్‌కో బైల్దేరి ఉంటారు.... అరే వేణూ! ఈ పూట వంటలెవడు చేస్తాడుగానీ, మనందరం హోటల్‌కి పోతే ఎంతవుతుందో లెక్క కట్టూ!" అని అరిచాడు వాసు.

వేణు చకచకా లెక్కలు చెప్పేశాడు — "వెళ్ళ డానికి 3 ఆటోలు. లేకపోతే ఒక వ్యాను. హోటల్లో కనీసం నూటయాభై. తిరిగి రావడానికి 3 ఆటోలు. లేదా వ్యాను. మళ్ళీ రాత్రికీ అలాగే. ఈ పూట అన్నాలు తిన్నాక ఇంటికి రాకుండా రాత్రిదాకా అక్కడే ఉండిపోతే ఆటోల ఖర్చులు కలిసి వస్తాయి. ఏకంగా రాత్రిళ్ళు కూడా తిన్నాకే రావచ్చు. కానీ ఒక పూటంతా హోటల్లో కూర్చుంటే వాళ్ళు రూము అద్దె వసూలు చేస్తారు. రోడ్డుమీద చెట్లకింద కూర్చుంటే అద్దె ఉండదు. రాత్రికూడా తిని ఇంటికి రావచ్చు."

వాసు మళ్ళీ నోరెత్తలేదు.

పనీపాటా లేకుండా నించున్న పెద్ద వాళ్ళిద్దరికీ సిగ్గు వొచ్చేలాగ చేద్దామని అరుణ కోపంగా — "వేణు చూడండి, ఎంత చక్కగా ఇంత మందికి కాఫీలు పెట్టాడు, ఉప్మా చేశాడు. ఈ పని మీరెందుకు చెయ్యలేరూ?" అంది భర్తతోటీ, మరిది తోటీ.

"వాడు చేసేశాక మళ్ళీ మేం చెయ్యడం ఎందుకూ?" అని తల ఎగరేశాడు ప్రసాద్.

"చమత్కారాలు కట్టిపెట్టి వంట మొదలు పెడతారా, లేదా?" తేల్చుమంది అరుణ. "రాత్రి దాకా ఇంకా ఎన్ని పనులు ఉన్నాయో! అవన్నీ ఎప్పుడు చేస్తారు?"

"అయితే రాత్రికి కూడా వంట చెయ్యరా మీరు?" అని ఆశ్చర్యపడ్డాడు ప్రసాద్ — "పోనీ సెలవు అంటే ఒక్కపూట చాలదూ?.... ఒక పని చేద్దాం. ఇప్పుడేగా ఉప్మాలు తిన్నాం. ఇక ఈ పూటకి అన్నాలు మానేద్దాం. మీరు చక్కగా ఈ పూట సెలవు తీసుకోండి. సాయంత్రం తొందరగా లేచి చక్కగా వంట చేసె య్యండి, ఏం? పాపం మీరు మాత్రం పూట పూటా ఏం చేస్తారు?"

అరుణ పళ్ళు కొరుకుతూ — "మా సెలవు అంటే అంత ఆటలాగా ఉందా? మీరిద్దరూ తక్షణం వంట మొదలు పెడతారా లేదా చెప్పండి!" అని అరిచింది.

ప్రసాద్ తాపీగా "వాడి సంగతి నాకు తెలీదుగానీ నేను మాత్రం చెయ్యనూ, చెయ్యనూ, చెయ్యనూ. మళ్ళీ చెప్పనా, చాలా?" అని తేల్చేశాడు.

"ఎందుకు చెయ్యరూ?" — అరుణ.

"ఎందుకు చెయ్యాలీ?" — ప్రసాద్.

"ఇవ్వాళ నాకు సెలవు గనకా."

"ఇవ్వాళ నాకూ సెలవే. ఇవ్వాళ ఆది వారం. వారానికి 6 రోజులు పని చేస్తానా? ఒక్క రోజు నాకు సెలవు. ఆ సెలవు రోజున నన్ను పని చెయ్యమంటే, నేను 7 రోజులూ పని చేసినట్టు అయిపోదం లేదూ? మరి నా సెలవు మాటేమిటి? నువ్వు బైట ఉద్యోగం చేసే మనిషివి అయితే, నన్ను కూడా ఇంట్లో పని చెయ్యమనడానికి నీకు హక్కు ఉంటే ఉంటుందేమో గానీ...."

వాసు కంగారుపడిపోతూ — "అన్నయ్యా! నువ్వు నా పీకల మీదకి తెచ్చేలాగ ఉన్నావు" అని అడ్డం పడబోయాడు.

"నువ్వాగరా! నా సంగతి నేను చెప్పుకోవాలా, వొద్దా?" అని అన్నగారు తమ్ముణ్ణి కసిరాడు. "విను అరుణా! నేను బైటికిపోయి 8, 10 గంటలు పని చేస్తున్నాను. నువ్వయినా ఇంట్లో అన్ని గంటలూ చెయ్య వలిసిందే. అలాగే చేస్తున్నావు. అంతేకదా?"

"సరే, అలాగే అనుకుందాం. మరి మీకు ఒక రోజంతా సెలవు ఉంటుంది. ఆ రోజంతా మీకు ఏ పనీ ఉండదు. మరి నాకు ప్రతి రోజూ పని ఉంటుంది. నేను ఎక్కువ గంటలు

చేస్తున్నట్టా కాదా?''

ఏదో చిక్కులో పడ్డానని గ్రహించాడు ప్రసాద్. ఒక్క క్షణం చక చకా ఆలో చించాడు. "ఆఁ.... ఇందాక కొంచెం లెక్క తప్పు చెప్పాను. రోజూ నా డ్యూటీ కాలం 8 గంటలు కదా? నీ పని 8 గంటలు ఉండదు. 6 గంటలే ఉంటుంది. నీకు రోజూ 2, 3 గంటలు పగలు విశ్రాంతి ఉంటుంది. అంటే, నీకు రోజూ కొంచెం సెలవు ఉంటుంది. అన్ని రోజుల సెలవలూ కలిపితే నీకూ ఒక రోజు పూర్తిగా సెలవు దొరికినట్టే. ఇప్పుడు సరిపోయిందా లెక్క?''

అరుణకి ఏడుపొచ్చినంత పనైంది. "నాకు రోజుకి 6 గంటలేనా పని?''

"అంతకన్నా ఎక్కువ గంటలు పని చేస్తున్నావా? ఎవరితోనన్నా చెప్పించు.''

"సరే, నా సంగతి అలా ఉంచుదాం. ఇంకా బోలెడు పనులు చేసుకునే ఆడవాళ్ళ మాటేమిటి? రోజుకి 24 గంటలూ చాలవు వాళ్ళకి.''

"వాళ్ళ మాట నాకెందుకూ? నీ మాట తేల్చు!''

"ఆడవాళ్ళందరికీ సెలవు ఉండాలన్నారుగా? అంటే నాకూ సెలవేగా? ఆ సెలవు, నే నెలా తీసుకోవాలీ?''

"ఏమో, ఎలా తీసుకోవాలో! తీసుకోమన్న వాళ్ళని అడుగు! నా సెలవని ఇచ్చెయ్యమంటే, నేనెందు కిస్తానూ? ఆది వారం నా సెలవురోజు. నా సెలవు రోజున పని చెయ్యమంటే నేనెందుకు చేస్తానూ?''

"సరే, అడుగుతాను, ఇప్పుడే అడుగు తాను" అని అరుణ గబగబా ఫోను తిప్పేసింది "హలో! హలో! గవర్నమెంటు కావాలండీ! చాలా అర్జంటు! అర్జం టుగా కావాలి!" అవతల నుంచీ చక్కగా ఒక మొగ కంఠం పలికింది — "హలో! ఎవరమ్మా?" అని! అబ్బా! ఎంత గాంభీర్యం ఉట్టి పడుతోందో ఆ కంఠంలో!

"గవర్న మెంటేనాండీ మీరు?''

"అవునమ్మా, ఏం కావాలి మీకు?" గవర్నమెంటు కంఠం ఫోనులోంచి అందరికీ జేగంటలాగా వినపడు తూనే వుంది.

"ఏవండీ, ఇళ్ళల్లో ఉండే ఆడవాళ్ళకి వారానికో రోజు సెలవు ఉండాలని మీరు పేపర్లలో రాశారు కదండీ!''

"అవునమ్మా, రాశాం. చక్కగా ఒకరోజు విశ్రాం తిగా గడపండమ్మా!''

"అయ్యో! ఎలా గడుపుతానండీ? పని చెయ్యనని మా ఆయన పొద్దున్ననించీ ఒకటే పోట్లాట! మరి నన్నేం చెయ్యమంటారండీ?''

అవతల కంఠం గాభరా పడింది. "ఆఁ.... పని చెయ్యనంటున్నాడా? అలా అనడానికి వీల్లేదే! సెలవు సంగతి ఆయనకి చెప్పావా అమ్మాయ్?''

"అయ్యో! ఆయనకీ తెలుసండీ! మీ సెలవు పప్పులు నా దగ్గర ఉడకవ్ — అంటున్నారండీ!''

"ఆఁ.... ఆఁ.... అంత మాటన్నాడా? అంత మాట! ఏదీ, అతన్ని పిలువ్!''

ఫోనుని ప్రసాద్ లాక్కున్నాడు — "అంత మాటన్న వాడిని నేనే సార్.''

"అన్నావా అంత మాట?''

"అంత మాటే కాదు, ఇంకెంత మాటైనా అంటా న్సార్!''

"ఆఁ.... ఆఁ.... నీకేం లెఖ్ఖలేదా మా మాటంటే?''

"ముందు మీకు లెక్కలు వొస్తే కదా సార్?''

"ఆఁ.... మాకు లెక్కలు రావా?''

"సూటిగా చెప్పేస్తాను లెండి సార్! మా ఆవిడ ఉద్యోగం చేసే మనిషి కాదండీ! ఇంటి పనే చేస్తుం దండీ. బైట పనే లేదండీ. రోజూ రెండు పూటలా లక్ష్మి వొచ్చి అంట్లు తోమి, గదులూ వాకిళ్ళూ ఊడ్చి, కొన్ని బట్టలు ఉతికి, అప్పుడప్పుడూ పప్పులు రుబ్బి — ఆ పనులన్నీ చేస్తుందండీ. అరుణ వంటే చేస్తుందండీ....''

వెనకనించి వాసు — "మా ఇంట్లో కుక్కరు కూడా ఉందని చెప్పు! వంట చిటికెల్లో అయి పోతుందని చెప్పు!" అని గుస గుస లాడాడు.

"నువ్వడ్డం రాకు" అని, అన్న తమ్ముణ్ణి కసిరి "అయ్యా, అదండీ. రోజు 8 గంటలు పని ఎవరైనా చేయవలసిందే కదండీ? అరుణ కూడా అలాగే చేస్తోందండీ.''

"అయ్యో, చెయ్యొద్దూ మరీ?" — గవర్నమెంటు ఒప్పుకుంది!

"అదేనండీ నేననేదీ. అరుణకి ఏ రోజు విశ్రాంతి ఆ రోజే ఉంటుందండీ. మధ్యాన్నం హాయిగా నిద్రపోతుందండీ! ఇంకో సంగతి చెప్పమంటారా? బట్టలమీద అద్దాలూ, పూసలూ, గవ్వలూ కుట్టుకో

డానికే రోజూ 2 గంటలన్నా ఖర్చు పెడుతుందండీ! ఏదన్నా పరీక్షలకి చదువుకోమంటే వినదు. ఏదన్నా పని నేర్చుకోమంటే వినదు. అలాంటప్పుడు నేనేం సాయం చెయ్యగలను, చెప్పండి? నా ఆదివారం సెలవు రోజుని తనకి ఇచ్చెయ్యమంటే, మరి నాకు సెలవెప్పుడో మీరే చెప్పండి!"

"అచ్చచ్చా! మంచి పాయింటే. పోనీ అబ్బాయ్.... ఇద్దరూ చెరోపూటా సెలవు తీసుకోండి, ఏం? ఇద్దరికీ సెలవు ఉంటుంది. బాగా చెప్పానా?"

"అదేవన్న మాట సార్? నా పూర్తి సెలవు నాకే ఉండాలి! అది నా హక్కు! నా సెలవలో ఒక పూటని నే నెందుకివ్వాలి?"

"ఓహో! అలాగంటావా?"

"అవున్సార్! అలాగే అంటా."

"అచ్చచ్చా! నీ పాయింట్ నోట్ చేసుకుంటాంలే."

"మరి నేను నా ఆదివారం సెలవు నాడు విశ్రాంతి తీసుకోవచ్చు కదా సార్?"

"అయ్యో, తీసుకోవద్దూ మరీ?"

ప్రసాదు ఫోను ఠకీమని పడేశాడు — "బతికాన్రా దేవుడోయ్! నేను పని చెయ్యక్కరలేదోచ్! గవన్నమెంటే నాకు చెప్పిందోచ్!" అని ప్రసాద్ చేతులు పైకెత్తేసి దణ్ణాలు పెట్టేశాడు.

అరుణ కోపంతో ఊగిపోతూ ఫోను మళ్ళీ లాక్కుంది. "అయ్యా. గవర్నమెంటు గారండీ! మా ఆయన అన్నీ తప్పు లెక్కలు చెపుతున్నాడండీ! ఆయనకి డ్యూటీ నించి ఇంటి కొచ్చేస్తే మిగతా కాలం అంతా ఖాళీయేనండీ! మరి నేను ఏ బాదరబందీ లేకుండా అంత ఖాళీగా ఎప్పుడన్నా ఉంటానాండీ....? పిల్లాడితో నాకు ఎప్పుడూ పని లాగే ఉంటుందండీ. పిల్లలకి రెండేళ్ళు దాటే దాకా తల్లికి నిద్రే ఉండదండీ! నేను ఇప్పుడిప్పుడే కొంచెం నిద్రపోతున్నానండీ! పిల్లాడితో అది మాత్రం ఏం నిద్రండీ? మరి అదంతా ఆయన లెక్క కట్టటం లేదండీ!"

"అచ్చచ్చా! మంచి పాయింటేనమ్మా! నోట్ చేసుకుంటాం."

అంతలో కమల "అక్కయ్యా! నేనూ మాట్లాడతా" అని లాక్కుంది ఫోను.

"హలో! హలో! నా పేరు కమలండీ!"

అవతల కంఠం— "చెప్పమ్మా! నీ సమస్యేవిటీ?"

"మా అక్కయ్య అయితే, బైట ఉద్యోగం చెయ్యడం లేదు. సరే! మరి, నేను ఉద్యోగం చేస్తున్నాను కదండీ? నా జీతం కూడా ఇంట్లోకే ఖర్చు పెడుతున్నానండీ! అత్త మామల్ని తల్లిదండ్రుల్లాగే చూసుకుంటున్నానండీ. ఇంట్లో పనులు కూడా చేస్తున్నానండీ! మరి ఇంటి పనుల్లో ఒక భాగం మా ఆయన కూడా చెయ్యాలి కదండీ? ఊహూ! చెయ్యనని మొరాయించి కూర్చున్నాడండీ! నాకేమో ఇంటా బయటా కలిసి రొండు పనులా? ఆయనకేమో ఒక్క పనేనా? ఇదేం న్యాయం, మీరే చెప్పండి?"

"అబ్బే, అదేం న్యాయం? న్యాయమే కాదు."

కమల సంబరపడిపోయింది. "న్యాయం కాదు గదండీ, కాదు గదండీ? మరి మా ఆయన్ని మీరు చివాట్లేస్తారాండీ?"

"పిలువ్ ....... వేస్తాను. పిలువ్ తొందరగా."

"ఇదుగో మిమ్మల్నే! గవర్నమెంటుగారు పిలుస్తున్నారు. రమ్మంటున్నారు" అని కమల కేకలు పెట్టింది.

"నన్నా? ఎందుకూ? నాతో ఏం పనీ గవర్నమెంటుకీ?" అని బెదురుకుంటూ వచ్చాడు వాసు.

"సార్.... సార్.... పిలిచారట సార్?"

"అవునయ్యా. పిలిచానూ. మీ ఆవిడకి రొండు పనులూ, నీకు వొక్క పనా? లెఖ్ఖేవన్నా బాగుందా?"

"ఆయ్.... బాగులేదా సార్?"

"ఏం బాగుందయ్యా? నువ్వే చెప్పు!"

"పోనీ కమలని కూడా వొక్కపనే తీసుకోమనండి సార్! ఇంట్లో ఉండిపొమ్మనండి సార్!"

"మరి జీతం ఎలా వొస్తుంది? మీ ఇల్లు ఎలా గడుస్తుంది?"

"అదే సార్.... కష్టమే సార్!.... కానీ ఏం చెయ్యను సార్? మా అమ్మ నాకు ఏ పనులూ నేర్పలేదు సార్!"

"ఏదీ, మీ అమ్మను పిలువ్!"

"అయ్యయ్యో, వొద్దు సార్! మా అమ్మకి జొరం! లేవలేదండీ. నాకే చెప్పెయ్యండి సార్!"

"మీ ఇంట్లో కుక్కరు కూడా ఉంది కదా? మరి ఏం కష్టం నీకు వంట చెయ్యడానికి? వంటంతా చిటికెల్లో అయి పోతుందిగా?"

"అబ్బెబ్బే! ఆ కుక్కరు అసలు పనే చెయ్యదు సార్! ఎప్పుడో తీసి మూల పడేశాం సార్!"

"మూలనించి తీసి బాగుచేయించూ! సమస్య

తీరిపోదూ?"

"అయ్యయ్యో....! అదీ.... మరీ...."

గవర్నమెంటుగారు గొంతు తగ్గించి గుసగుస లాడారు — "ఇక్కడ పుల్లతీసి అక్కడా, అక్కడ పుల్లతీసి ఇక్కడా పెట్టండయ్యా! లేకపోతే మా బిల్లెం కావాలి? ఆడవాళ్ళ కోసం ఏవో కాస్త చేస్తున్నట్టు కనపడాలి ... అదే, చెయ్యాలి కదా?"

"అయ్, పుల్లలు ఇటూ అటూ పెట్టేస్తేనే వంట అయిపోతుందా సార్?"

"అబ్బా, ఈ కుర్రాళ్ళకి తెలివే ఉండడం లేదు.... చూడూ, నీ నీ పేరేంటన్నావ్?"

"ఏం అనలేదు సార్!"

"సరే, ఇప్పుడు అనూ!"

"వెంకట శ్రీలక్ష్మి వాసుదేవ నాగేసర్రావండీ. ఇంటిపేరు కూడా చెప్పమంటారా సార్?"

"వొద్దొద్దు, అంత పేరు పిలవలేను గానీ, లక్ష్మీ రావూ! నీ ఆరోగ్యం మరీ అంత మంచిదా? ఎప్పుడూ ఏ నెప్పులూ రానేరావా? తలనెప్పో, మెడనెప్పో, పంటినెప్పో.... తుంటి నెప్పో...."

"అబ్బే, ఏ నెప్పులూ.... ఆఁ, తెలిసింది సార్! అర్థమైంది సార్! థ్యాంక్యూ సార్! ఈసారి నా ఓటు మీకే సార్!" అనేసి వాసు ఫోన్ ఠకీమని పడేశాడు. 'ఇప్పుడే వొస్తా, ఇప్పుడే వస్తా' అంటూ బైటికి పరుగు లంకించుకున్నాడు.

"అదేమిటి? అదేమిటి? ఎక్కడికి పోతున్నాడు" అని అందరూ హాహాకారాలు చేస్తోండగానే ఏదో కాయితం ఎగరేసుకుంటూ వొచ్చి కమల ముందు వాలాడు — "ఇదిగో చూసుకో! డాక్టర్ స.... ర్టి.... ఫి.... కె.... ట్....! నాకు తల నొప్పి! కడుపు నొప్పి! మెడనొప్పి! మోకాళ్ళ నొప్పి! శీల మండల నొప్పి! వొళ్ళంతా వొకటే నొప్పులు! మనసు కూడా ఏం బాగోలేదు. డాక్టరు ఈ రోజంతా రెస్టు తీసుకోవాలన్నాడు" అంటూ ఆ కాయితం కమల మొహం మీద ఆడించాడు.

"ఎంత మోసం! ఎంత మోసం!"

"మోసమా? నేను నెప్పులతో ఛస్తోంటే ...... రెస్టు తీసుకోవాలి."

"రెస్టు — తినా, తినకుండానా? ఎంత మోసం!" అని కమల కోపంతో ఊగిపోయింది. "సరే, నేనూ చూస్తాను...." అని టకటకా ఫోను తిప్పింది. "హాలో.... హాలో.... హాలో.... గవర్నమెంటు గారేనా? చూశారా? మా ఆయన్ని పని చెయ్యమని మీరు చివాట్లేసినా ఆయన వంటింట్లోకి రాకుండా డాక్టర్ సర్టిఫికెట్ తెచ్చేసుకున్నాడండీ! నేను కోర్టుకి పోదలుచుకున్నాను. ఐ విల్ గో టూ కోర్ట్! మీరు వెంటనే ఆ డాక్టర్ సర్టిఫికెట్ చెల్లకుండా 'స్టే' పంపాలి సార్! లేకపోతే ఈయన పని చెయ్యడు. ఈయన అన్నగారెలాగూ పనిచెయ్యడం లేదు. ఈయన్ని కూడా నేను వదలదల్చుకోలేదు. ఎందుకు వదలాలి సార్?.... అర్జంటుగా 'స్టే' పంపాలి సార్ నాకు!"

"సరేనమ్మా! ఇప్పుడే పంపిస్తా!"

"ఇంకొక్క మాట సార్! అసలు ఆడ వాళ్ళ సెలవు రోజున ప్రతీ ఇంటికీ ఇద్దరేసి పోలీసుల్ని పంపాలి సార్! లేకపోతే ఈ మొగాళ్ళు పని చెయ్యనే చెయ్యరు సార్!"

వెనక నించి శకుంతల — "మొగ పోలీసులు వొద్దు. ఆడ పోలీసుల్నే పంపమని చెప్పు" అని గుడ గుడ లాడింది.

"సార్ సార్.... మొగపోలీసులైతే వీళ్ళూ వాళ్ళూ కుమ్మక్కై పోతారండీ. ఆడ పోలీసులే కావాలండీ."

"ఆడ పోలీసు స్టాఫ్‌ని పెంచితేగానీ అది అప్పుడే సాధ్యం కాదమ్మా! నీకెందుకు? 'స్టే' పంపిస్తాను కదా?"

"సరే సార్!"

ఫోను పెట్టేటప్పటికి 'స్టే' రానే వచ్చింది!

"కమలాదేవి గారెవరండీ? 'స్టే' తెచ్చాను" అని కోర్టు మనిషి ప్రత్యక్ష మయ్యాడు గుమ్మంలో.

కమల ఆ స్టేతో వాసు దగ్గిరకు ఉరికింది. "ఇదుగో స్టే! చదువుతున్నాను. అందరూ వినండి!" అని గబగబా చదివింది — "స్త్రీల సెలవు రోజున మొగవాళ్ళకి ఎక్కడ ఎన్ని నొప్పులున్ననూ, మనసులూ ఆత్మలూ ఎంత ఏడుస్తూ వున్ననూ, నోరు మూసుకుని కిక్కురుమనకుండా ఇంటి పనిలోకి దిగవలసిందే! మొగాళ్ళు తెచ్చుకునే డాక్టర్ సర్టిఫికెట్లు ఇంట్లో చెల్ల నేరవు. ఇది గవర్నమెంటు వారి ఆజ్ఞ!"

అరుణా, శకుంతలా పొంగిపోయారు. "ఎంత బాగా రాశారో! ఎంత బాగా రాశారో!" అని ఆశ్చర్య పోయారు.

కమల ధీమాగా 'స్టే' కాయితాన్ని వాసు మొహం మీద ఆడించింది. "ఇప్పుడేం చెపుతావు?" అన్నట్టు.

వాసు, లోపల్లోపల భీతెత్తాడు మొదట. కానీ మరునిమిషంలోనే తేరుకుని కమల కన్నా ధీమాగా నవ్వాడు. "దాచుకో దాన్ని! రేప్పొద్దున్న నాలిక గీసు కుందువుగాని" అన్నాడు.

"హేవిటీ! స్టే వొచ్చినా...." అని కమల 'నిర్ఘాంతం'తో మాటే పూర్తి చెయ్యలేకపోయింది.

వాసు ఒక కుర్చీ చూసుకుని, కాలు మీద కాలేసు కుని కూర్చున్నాడు "ఎన్నిసార్లు చెప్పాలి? నేను ఏ పనీ చెయ్యనూ, చెయ్యనూ, చెయ్యనూ!" అని కాళ్ళు ఇటూ అటూ మార్చుకున్నాడు. "ముచ్చటగా మళ్ళీ చెప్పనా?"

"మరి నా స్టే?" అని అరిచింది కమల.

"వెకేట్ ఐపోయింది. అనగా తోసి పారేశాను. నేను కదలకుండా కూచుంటే సరీ. ఇది నా చేతిలో పనీ" అని సరిగా అర్థం చెప్పాడు వాసు.

ఆడవాళ్ళంతా నోళ్ళు తెరిశారు.

అన్నపూర్ణమ్మకి కూడా "అయ్యో, ఇలా అయ్యిందే!" అని మనసులో ఎక్కడో చివుక్కుమని పించింది.

"ఆహాహాహా" అంటూ వేణూ పెద్ద నవ్వుతో రంగం లోకి ప్రవేశించాడు. "వదినలూ! తెలిసిందా ఇప్పటి కైనా? 'మేం చెయ్యం' అన్న మొగవాళ్ళని గవర్న మెంటు ఏమీ చెయ్యలేదని తెలిసిందా?"

కమల మండిపడుతూ నిప్పులు కురిసింది. "మళ్ళీ కంప్లయింట్ ఇస్తే వెయ్యి రూపాయలు జరిమానా వేస్తారు, తెలుసా?" అంది.

"సరే, వేస్తారు. మొగాళ్ళు పని ఎగ్గొట్టేసి జరి మానాలు కట్టేస్తే గవర్నమెంటుకి డబ్బొస్తుంది. దాని వల్ల మీకేం వొస్తుంది? సెలవు వొస్తుందా? మీకు సెలవైతే రాదు కదా? ఆ రోజు కూడా ఇంటి పనులన్నీ మీరు చేసుకోవలిసిందే కదా?"

ఆడవాళ్ళు తెల్లగా తెల్లబోయారు.

శకుంతల వొక్కత్తీ కాస్త తొందరగా తేరుకుని — "ఆ డబ్బు గవర్నమెంటుకి కాదు, మాకే ఇచ్చెయ్యాలని అడిగితే?" అని మిగతా వాళ్ళని నవ్వు మొహంతో చూసింది.

"సరే, ఆ డబ్బు మీకే ఇస్తారనుకుందాం. అప్పుడు మాత్రం ఏం జరుగుతుంది? మీకు సెలవు వొస్తుందా? మీరు ఏ సెలవు కోసం అడుగుతున్నారో ఆ సెలవు అయితే అప్పుడు కూడా రాదు కదా? డబ్బు తీసు కున్నాక, ఆ రోజు కూడా పనులన్నీ మీరే చేసుకోవాలి. అంటే, మీ సెలవుని డబ్బు కోసం అమ్మేసుకుంటా రన్నమాట! డబ్బు తీసుకుని పని చేస్తారన్నమాట!"

అంతా నిశ్శబ్దం! పిట్టలూ, దగ్గులూ అన్నీ ఆగాయి!

కమల గంభీరంగా అంది — "అవును వేణూ! నువ్వన్నదే నిజం! వాళ్ళకి జరిమానాలు వేస్తే మాకే మిటీ, జైళ్ళల్లో పెడితే మాకేమిటీ? వాటివల్ల మాకు సెలవైతే రాదు కదా? వాళ్ళు ఇష్టపడి ఇస్తేనే మేము సెలవు తీసుకోవాలన్న మాట! అంటే మా హక్కు వాళ్ళ 'దయ' మీద ఆధారపడి ఉందన్న మాట! హూ! అదేం హక్కు?.... మరి వేణూ, ఎలాగ ఈ సమస్యకి పరి ష్కారం?"

"ఎలాగేమిటి?.... తి.... ర.... గ.... బా.... టే....!"

"ఇదంతా 'తిరుగుబాటు' కాదా?"

"కాదు. ఇదంతా ఉత్త నవ్వులాట! ఉత్త కాలక్షేపం ఆట!"

"మరి 'తిరుగబాటు' ఇంకెలాగ?"

"ఆలోచిస్తే మీకు తెలీదూ? పెద్దొదినా! నువ్వు చెప్పు! 'ఆడా మగా సమానులే' అని నువ్వు నిజంగానే అనుకుంటావా?"

"ఎందుకు అనుకోను వేణూ? అందరూ ఒకటే. అందరూ మనుషులే."

"మరి ఇంటి పనికే అంకితమై ఉంటానని ఎందుకు వొప్పుకుంటున్నావు?"

"అలా నే నెప్పుడొప్పుకున్నాను?"

"ఇంటి పని నించీ వారానికి ఒక్కరోజు సెలవు అడగడం అంటే, 'మిగతా ఆరు రోజులూ ఇంటి పని నేనే చేస్తాను, అది నా బాధ్యతే' అని ఒప్పుకోడం కాదా?"

అరుణ తెల్లబోయి తికమక పడింది. "ఉద్యోగం చేస్తోన్న కమలకూడా అలాగే అడుగుతోందిగా మరీ?"

"కమల వదిన మరీ తప్పు చేస్తోంది. చిన్నన్న య్యని ఇంటి పనులు రోజూ చెయ్యాలని డిమాండ్ చెయ్యడానికి కమల వదినకి పూర్తిగా హక్కు ఉంది. అలాంటి హక్కు నీకు అంత పూర్తిగా ఉండదు. తనకి

ఏ హక్కు ఉందో చిన్న వదినకీ తెలీదు. నీకు ఏ హక్కు లేదో నీకూ తెలీదు. బైట పనిచేసే ఆడవాళ్ళ పరిస్తితీ, చెయ్యని ఆడవాళ్ళ పరిస్తితీ, ఒకటి కాదు. అయినా, 'ఒకరోజు సెలవు పోరాటం' ఉద్యోగాలు చేసే స్త్రీలకూ పనికిరాదు, చెయ్యని స్త్రీలకూ పనికి రాదు. అసలు 'ఒకరోజు సెలవు' ఆలోచనే తప్పు!" వేణు, ఉపన్య సించే మూడ్‌లోకి వచ్చేశాడు. "నాకు రెండంటే రెండు నిమిషాలు టైము ఇచ్చి ఓపిగ్గా వింటారా?"

"అయ్యో! చెప్పు వేణూ! అందుకే కదా అడుగు తున్నాం...." అన్నారు వదినలు.

వేణుకి ఉపన్యాసాలివ్వడం చాలా ఇష్టం. బాగా అలవాటుకూడా. పొంగిపోతూ మొదలు పెట్టాడు — "మొగాళ్ళకి బైట పనీ, ఆడవాళ్ళకి ఇంటిపనీ — అని ఏనాటినించో సాగుతోంది కదా? పెద్ద వదినా, శకుంత లత్తయ్యా, ఆ సాంప్రదాయానికే లోబడతామంటు న్నారు. ఎప్పుడూ ఇంటిపని చేసుకుంటూ ఉండడానికే ఒప్పుకుని, అందులోనే 'ఒక రోజు సెలవు' అడుగు తున్నారు. సెలవు దొరికితే అంతా చక్కబడిపోయినట్టే అనుకుంటున్నారు. కానీ, దాని వల్ల మీ సమస్యలు తీరుతాయా?

ఆడా మగా సమానం అవ్వాలంటే ఏకైక సూత్రం ఏమిటో తెలుసా?

ఇద్దరికీ — బైటి పనీ,

ఇద్దరికీ — ఇంటి పనీ! అదీ సూత్రం!

బైటి పనికే సెలవలు ఉంటాయి. అవి, ఇద్దరికీ ఉంటాయి.

ఇంటి పనికి సెలవులు ఉండవు. అవి, ఇద్దరికీ ఉండవు.

బైటి పనికే 'ఇన్ని గంటలు' అనే హద్దులూ లెక్కలూ సాధ్యం!

ఇంటి పనికి అలాంటి హద్దులూ లెఖ్ఖలూ కొలతలూ సాధ్యం కావు.

ఇంటిపని అంటే — వంటలూ, తోముళ్ళూ ఉతు కుళ్ళూ మాత్రమే కాదు. అందులో, పిల్లల పెంప కాలూ, పెద్దవాళ్ళని చూసుకోడాలూ అన్నీ ఏకమై పోయి, పెన వేసుకుపోయి ఉంటాయి. వాటిని గంటల లెఖ్ఖల్లోకి ఇమడ్చడం సాధ్యం కాదు. ఇంట్లో ఉన్న జబ్బు మనుషుల కోసం చెయ్యవలసిన పనుల్ని 'అది నీ వొంతే' అంటే, 'నీ వొంతే' అని కీచులాడుకునే మనుషులు, జంతువులతో పోల్చడానికి కూడా తగని వాళ్ళు! చంటిపిల్లల అవసరాల్ని ఒకరి మీదకి ఒకరు గెంటుకునే తల్లిదండ్రుల్ని దేనితో పోల్చాలో ఇంకా కనిపెట్టాలి!

ఇంటిపని — గాలి పీల్చడం లాంటిది. దానికి రాత్రీ పగలూ, నిద్రా మెలుకువా — అనే హద్దులు ఉండవు. దానికి విరామాలూ విశ్రాంతులూ సెలవులూ వర్తించవు.

బైటిపనీ, ఇంటిపనీ — రెండూ కలిసినదే మను షుల జీవితం! మనుషులుగా ఉండదల్చుకున్న వాళ్ళు, ఆ రెండు పనుల్నీ తమ బాధ్యతగా చేసు కోవాలి. ఆ బాధ్యత — ఈ రోజూ, ఆ రోజూ — అని కాదు! ఈ వారం, ఆ వారం — అని కాదు. అన్ని రోజులూ ఒక్కలాగే, అన్ని వారాలూ ఒక్కలాగే, ఉండాలి.

బైట పని లక్షణాల్నీ, ఇంటి పని లక్షణాల్నీ అస్త వ్యస్తం చేసేసి, అందులోనించి ఏదో పట్టుకుందా మంటే ఏం దొరుకుతుంది, కుమ్ములాటలూ గుద్దు లాటలూ గాక?

మనింట్లో తెల్లారగట్ల నించీ జరుగుతోంది అదే!

పెద్దొదినా! చిన్నొదినా! శకుంతల అత్తయ్యా! నా మాటకి విలువిచ్చి ఇంత శ్రద్ధగా విన్నారంటేనే మీ సమస్య మీద మీరెంత బాధపడుతున్నారో అర్థమవుతోంది. కానీ బాధపడితే చాలదు. అందు లోంచి బయటపడే మార్గాన్ని సరిగా గ్రహించు కోకపోతే సాధించేదేమీ ఉండదు. ఇక, మీ పోరాటం ఎలా చేసుకుంటారో చేసుకోండి! చెయ్యకపోతే ఎప్పటిలాగే ఊరుకోండి! వాళ్ళకి దయ కలిగిన నాడు, లేకపోతే మావయ్య అన్నట్టు, మీకు రోగాలో రొష్టులో వొచ్చినన్నాడు, మొగాళ్ళు ఏదన్నా పని చేస్తే, దానితో సంతోషించండి! లేకపోతే లేదు. అంతేగానీ, సమస్యనే అర్థం చేసుకోకుండా తప్పుడు పోరాటానికి దిగి నవ్వుల పాలై పోకండి!"

వేణూ ఉపన్యాసం ప్రేక్షకులందరిలోనూ రక రకాలు మార్పులు తెచ్చింది.

అందరికన్నా ముందు కమల సరిగానే అర్థం చేసుకుంది. "మాకు ఎవరి దయా అక్కర్లేదు. మాకు

కావలసింది సహాయంగా కాదు. హక్కుగా కావాలి!" అని గట్టిగా ప్రకటించింది.

"అక్కయ్యా, ఇలారా!" అని అక్కగార్ని తలుపు చాటుకి లాక్కుపోయింది.

అక్కడ గుడ గుడలు సాగుతోన్నంతసేపూ అరుణ "అమ్మో.... అమ్మో...." అని కెవ్వు కెవ్వున అరుస్తూనే ఉంది. కాస్సేపటికి "సరే, సరే' అని స్తిమిత పడింది.

వాసూ, ఆ గుసగుసలన్నీ పసికట్టాలని ఆ చుట్టు పట్ల తచ్చాడి చూశాడు. కానీ లాభం లేకపోయింది. మళ్ళీ కుర్చీ ఎక్కాడు.

తర్వాత కమల అందరికీ వినపడేలాగ ఒక ప్రకటన చేసింది. "అక్కయ్యా! నేను కళ్ళు తెరిచాను. మా ఆయనకి నా మీద ఏమీ ప్రేమ లేదని అర్థమై పోయింది. నేను ఒక్క గంట విశ్రాంతిగా ఉండడానికి కూడా ఆయన నా కోసం ఏ పనీ చెయ్యడు. ఇలాంటి సంసారం ఇంకా గుడ్డిగా నేను చెయ్యదల్చుకోలేదు. నా దారిన నేను వెళ్ళిపోతున్నాను. నాకు ఉద్యోగం ఉంది. జీతం వస్తుంది. నా బతుకు నేను బతగ్గలను."

అరుణ తల వాలేసింది. "నేను కూడా చిన్నాని తీసుకుని నీతోనే వొచ్చేస్తాను కమలా! ఏదైనా పని చూసుకునే దాకా మా ఇద్దరికీ కొంచెం అన్నంపెట్టు. నీకు ఉన్న స్వతంత్రం నాకు ఎందుకు లేదో నాకు ఇప్పుడు అర్థమైంది. నా పిల్లాణ్ణి నేనే పోషించు కుంటాను. నేనే పెంచుకుంటాను. ప్రేమ లేని భర్త దగ్గర నేనూ ఉండను.... ఇప్పుడే వెళ్ళిపోదాం. మన బట్టలన్నీ సర్దేస్తాను తొందరగా" అంది ఉత్సాహంగా.

తర్వాత వంతు శకుంతలది! "నేను కూడా వొచ్చేస్తానర్రా మీతో. ఎన్నేళ్ళు కాపరాలు చేసినా ఈ ముదనష్టపు మొగాళ్ళకి పెళ్ళాలమీద గుడ్డి గవ్వంత అభిమానం కూడా రాదు. ఎందుకీ పాడు సంసారాలూ? నేనూ, అరుణా ఏ పచ్చళ్ళు పెట్టుకునో, అప్పడాలు చేసుకునో, బట్టలమీద అద్దాలు కుట్టుకునో, ఎలాగో ఒకలాగ నాలుగు రాళ్ళు సంపాదించుకోలేక పోము. నా బట్టలు కూడా తెచ్చుకుంటా నుండండి. కామేశ్వరిని కూడా పిల్చుకొచ్చేస్తాను" అని తను కూడా భర్తని వదిలేసి బైల్దేరడానికి సిద్ధమైంది.

రేఖ కూడా ముందుకొచ్చింది. "పెద్దొదినా! నేనూ వొచ్చేస్తాను. ఏదన్నా ఉద్యోగం చేసుకుంటాను."

వేణు అందరికన్నా ముందే తయారయ్యాడు. "నేనూ మీతోటే. ఈ పురుష అహంకారులతో కలిసి నేను ఉండను. అమ్మనీ నాన్ననీ కూడా మనతోటే తీసి కెళ్ళి పోదాం. వాళ్ళని మనమే జాగ్రత్తగా చూసు కుంటాం. వెళ్ళగానే పప్పు నానబోసి గారెలు వొండేసు కుందాం."

అప్పటిదాకా కాలు మీద కాలేసుకుని కూర్చున్న వాసూకి కాళ్ళు వణకడం మొదలైంది. బెంబేలెత్తిపోతూ అన్నగారి చెవి మీదపడి "అన్నయ్యా. సీనంతా ఇలా మారి పోయిందేవిటి? వేణూ గాడొకడు! వాళ్ళు గారెలు కూడా వొండుకుంటారంట! అందరూ వెళ్ళిపోయేలాగ ఉన్నారు! బట్టలు సర్దేసుకుంటున్నారు! తప్పయిందని వొప్పేసుకుందాం అన్నయ్యా" అని లబలబలాడాడు.

ప్రసాద్ గంభీరంగా. "నువ్వు తప్పు వొప్పేసుకో! కమల ఉద్యోగం చేస్తోంది. నువ్వు ఇంటి పనులు చెయ్యడం చాలా న్యాయం" అని తమ్ముడికి హితోప దేశం చేశాడు.

"ఏవిటీ, నేనొక్కణ్ణే లొంగిపోవాలా? కమల జీతం మేమిద్దరమే దాచుకుంటున్నామా? ఇంటి కోసమే వాడుతున్నాం కదా? ఇంటి పని నువ్వు మాత్రం ఎందుకు చెయ్యొద్దూ?" అని కస్సుమన్నాడు తమ్ముడు.

"ఓహో! నువ్వూ తిరగబడ్డావా? సరే, సరే!.... ముందు నీ పని కానీ! తర్వాత నేనూ.... నెమ్మదిగా.... దిగుతాలే."

వాసు చేతులు కట్టుకుని నేల చూపులు చూస్తూ కమల ముందు నిలబడి పాఠం అప్పజెప్పేశాడు. "కమలా! ఎక్కడికీ వెళ్ళొద్దు — నువ్వు లేకపోతే నేను బతకలేను" — అయిపోయింది పాఠం!

కమల వేలుముడి ఎగరేసింది. "అవును మరి. అన్నం వొండే వాళ్ళెవరూ ఉండరు కదా? మీకేమో పాపం వొండుకోడం రాదయ్యే! బతకడం కష్టమే.... అక్కయ్యా! సర్దడం అయిపోయిందా? ఇంకెంత సేపు?"

"అందుక్కాదు కమలా! నువ్వు జడ వేసుకోడానికి కూడా ఖాళీ లేకుండా ఇంటా బయటా బోలెడు శ్రమ పడుతోంటే నేను ఎంత బాధపడిపోతున్నానో నీకేం తెలుసు?"

కమల ఆ మాటలు చెవిన పెట్టలేదు. "వేణూ! ఆటోలు పిలువు" అని కేక పెట్టింది.

"వొద్దు కమలా! నా మాట విను కమలా! మీరెలా చెప్తే అలా వింటాం. వంటంతా నేర్చుకుంటాం కమలా!" — వేణు.

అరుణ ఆ డైలాగ్ కోసమే చెవులింతింత చేసుకుని ఎదురు చూస్తోంది. "వాసూ! 'వింటాం' 'కుంటాం' అంటున్నావు. మీ అన్నగారు కూడా వింటారా? మీ అన్నగారు కూడా 'కుంటారా'?" అని చేతులు తిప్పింది.

ప్రసాద్ ముందుకొచ్చాడు — "నేను ఇంటి పని కూడా చెయ్యాలంటే మరి నువ్వు బైట పనికూడా చేస్తావా? ఏం ఉద్యోగం చేస్తావు?"

"ఆఁ.... ఉన్నాయి ఉద్యోగాలు రాసులు పోసి! అయ్యో, అవును, అసలు అదే అడగాలి!" అని అరుణ గబగబా ఫోను తిప్పింది — "హలో .... హలో! గవర్నమెంటు గారు కావాలండీ! అర్జంటుగా కావాలండీ....!"

అవతల నించీ "చెప్పమ్మా! స్టే అందిందా? మీ మొగాళ్ళు పనులు చేస్తున్నారా?"

"అయ్యా! వాళ్ళుకూడా ఇంటిపనులు చెయ్యాలంటే, మేం కూడా బైట పనులు చెయ్యాలండీ! లేకపోతే, వాళ్ళేమంటున్నారో తెలుసాండీ? నువ్వు బైటిపని చేస్తే, నేను కూడా ఇంటి పని చేస్తానుగానీ, లేకపోతే, నేను ఇంటి పని ఎందుకు చెయ్యాలి? నాకు ఆ పనీ, నీకు ఈ పనీ' అంటున్నారండీ! ఉద్యోగాలు లేని ఆడవాళ్ళం బోలెడు మంది ఉన్నామండీ! నేనూ, శకుంతలా, కామేశ్వరీ, రేఖా ఇంకా చాలా మంది ఉన్నామండీ! అందరికీ ఉద్యోగాలు కావాలండీ! ఈ స్టేలూ, ఈ బిల్లులూ, ఈ సెలవలూ, ఈ చట్టాలూ, ఇవన్నీ మాకొద్దండీ! ఉద్యోగాలు లేకపోతే మొగాళ్ళ సంపాదన మీద ఆధారపడి బతకవలసిందే కదండీ! అయ్యో, వింటున్నారా?.... హలో!.... హలో....! హలో....! కమలా! ఇదేమిటీ? ఉద్యోగాల మాటెత్తితే గవర్నమెంటు పలకడం లేదేం? అయ్యో, ఇదేమిటి?...."

"సరేలే, తర్వాత చూద్దాం. తొందరగా రా అక్కయ్యా! ఆలస్యమైపోతోంది. ఇల్లు మారాక తొందరగా అన్నం వండి, చిన్నికీ మావయ్యకీ పెట్టాలా వొద్దా? కదులు తొందరగా!" అని హడావుడి పడింది కమల.

హాల్లో తలుపు చాటున హనుమంతు శకుంతలని తెగ బతిమాలుకుంటున్నాడు, ఎక్కడికీ వెళ్ళొద్దని. "ఇంటికి పోదాం పద. కాఫీ పెట్టేస్తాను. ఎంతసేపు? పావుగంటలో పప్పూ, పులుసూ అన్నీ వండేస్తాను" అంటున్నాడు.

"వేదాల్లో రాశారా మరీ?" అంది శకుంతల.

"ఏదో మిడికార్లే. వాళ్ళ గోల మనకెందుగ్గానీ" అని ఇకిలించాడు హనుమంతు.

దగ్గుల జగన్నాథం అప్పుడు నిజంగానే నోరు తెరిచి "హనుమంతూ, ఇలారా!" అని కేక పెట్టాడు.

"వొస్తున్నా బావా!" అంటూ హనుమంతు వినయంగా జగన్నాథం ముందు హాజరయ్యాడు.

"పొద్దున్న నించీ అంతా వింటూనే ఉన్నానోయ్! ...... ఆడపిల్లలతో మీకు పంతాలా? వాళ్ళు ముద్దుగా అడిగితే చేసి పెట్టలేరూ?.... ఖంగ్!"

"అబ్బే! వొండుతాననే అంటున్నాను బావా! కానీ, వాళ్ళు ముద్దుగా అడిగారా? గుద్దులేస్తూ అడిగారు. మొదట 'ఆత్మరక్షణ' కోసం కొంచెం పెనుగులాడాం అనుకో."

"మా పెద్దవాళ్ళిద్దరికీ కాస్త వంటా వార్పూ నేర్పు! .... వాసూ! ప్రసాద్! మీరిద్దరూ మామయ్య దగ్గిర ఒక్క వారం రోజుల్లో అన్నీ నేర్చుకోవాలి. తెలిసిందా? వొచ్చే ఆదివారం నాడు మీరిద్దరే పులిహోరా, గారెలూ చెయ్యాలి! విన్నారా? ఖంగ్! ఖంగ్!"

"ఆఁ.... విన్నాంగానీ నాన్నా! నువ్వు ఏనాడన్నా అమ్మకి గ్లాసుతో మంచినీళ్ళన్నా ఇచ్చావా? పెద్ద.... ఇవ్వాళ మేం దొరికామా నీకు?" అని ఎదురు తిరిగారు పుత్రులిద్దరూ!

"నేను మంచి నీళ్ళిచ్చేదాకా ఆగితే.... ఖంగ్.... మీ అమ్మ పని అయినట్టే! మా రోజులు వేరు! అప్పుడు మీ అమ్మకి చెప్పాలనీ తెలీదు, నాకు చెయ్యాలనీ తెలీదు. ఎందుకూ, నాకు దగ్గు తగ్గనివ్వండి! ఆ మూలా ఈ మూలా చూడండి, బూజులు ఎలా వేళ్ళాడుతున్నాయో! .... వాటి పని నేను పడతాను.... ఈలోగా బూజులకర్రకొని పట్టుకు రండి!.... అన్నట్టు వాకిట్లో మొక్కలనిండా చీడ పట్టింది. మొన్న చూశాను .... దగ్గు తగ్గాక దాని పనికూడా చూస్తాను.... ఖంగ్! ఖంగ్! హనుమంతూ! నీ ఆయుర్వేదం కషాయం ఏదో తెచ్చి పెట్టు! ఈ ఇంగ్లీషు మందులతో తగ్గి చావడం లేదు.... అమ్మాయ్ అరుణా! ఖంగ్! కమలా! మీరి

ద్దరూ ఇలా రండి! మీ బట్టలవీ మళ్ళీ అలమారుల్లో పెట్టేసుకోండి! వాళ్ళిద్దరూ ఈ పూటనించే మీరు చెప్పినట్టు పని చెయ్యకపోతే వాళ్ళ బట్టలు తీసి బైటికి విసిరెయ్యండి! వాళ్ళే బైటికి పోతారు, తెలిసిందా? ఖంగ్...."

అరుణ సంతోషంతో పెద్ద కేక పెట్టింది. "మావయ్య చెప్తున్నారుగా, కమలా రావే! బట్టలన్నీ ఎక్కడివక్కడ పెట్టేద్దాం. అత్తయ్యా, మీరు కమలకి సాయం చెయ్యండి! నేను మావయ్యకి గుక్కెడు కాఫీ ఇచ్చి వొచ్చేస్తాను."

"లక్ష్మి వొచ్చింది" అని రేఖ అరిచింది.

జ్వరం తగ్గీ తగ్గకుండానే వచ్చింది లక్ష్మి. "గిన్నె లన్నా తోమి పెడదామని వొచ్చా నమ్మా!" అంది నీరసంగా పనికి ఉపక్రమిస్తూ.

అన్నపూర్ణమ్మ అడ్డంపడి "మంచి దానివే! ఇంకా మొహం అలాగే ఉంది. జ్వరంతో ఏం చేస్తావు?.... తగ్గేదాకా రావొద్దని చెప్పలేదూ? ఇంత మంది ఉన్నాం. మేమే చేసుకుంటాంలే. ఇంటికెళ్ళి పడుకో" అంది.

కమల పరుగెత్తి కొచ్చి "లక్ష్మీ! ఇవ్వాళ ఆడవాళ్ళకి సెలవు కదా? వంట మీ ఆయన చేశాడా లేదా?" అని ఆరా తీసింది.

"నాకు జొరం కదమ్మా! పొద్దున్న నేను లేవలేదని తనే ఉడకేశాడు. జొరం లేకపోతే చేస్తాడేంటమ్మా?" అని నవ్వింది లక్ష్మి.

"కానీ, నువ్వు బైట పని చేస్తున్నావు కదా? అందు కని, మీ ఆయన్ని రోజూ ఇంట్లో ఉన్నప్పుడు ఈ పనీ ఆ పనీ చెయ్యమనీ చెప్తూ ఉండు! చూడు, ఇవ్వాల్టి నించీ మా మొగాళ్ళని ఇంటి పనుల్లోకి దింపే స్తున్నాం!" అని కమల పొంగిపోతూ ప్రకటించింది.

"ఆఁ ...... ఎందుకు చేస్తారులేమ్మా?" అని మళ్ళీ నవ్వింది లక్ష్మి, నమ్మలేక.

వేణు లక్ష్మికి గిన్నెతో ఉప్మా అందించి — "నేనే చేశాను లక్ష్మీ" అన్నాడు.

తర్వాత వేణు, వదినల ముందు ఒక ప్రతిపాదన పెట్టాడు — "మన ఇంటి పనుల్లో మూడో వంతు పని లక్ష్మే చేస్తోంది. ఆమెకి ఇది 'బైటి పని'! కానీ మనం ఇన్నాళ్ళూ లక్ష్మి సెలవు గురించి ఆలోచించనే లేదు. తక్షణం ఇప్పుడు ఆలోచించండి!"

"అవును వేణూ! 'బైటి పని'కి సెలవు ఉండాలి కదా? అలాగే చేద్దాం" అంది కమల.

అరుణ సంతోషంగా — "లక్ష్మీ! ఇవ్వాల్టినించీ నీకు ప్రతీ ఆదివారం సెలవు" అంది.

"ఎందుకమ్మా, వొద్దులేమ్మా" అంది లక్ష్మి సిగ్గు పడుతూ. కానీ లక్ష్మి మొహం సంతోషంతో వెలిగి పోయింది. ఉప్మా గిన్ని తీసుకుని వెళ్ళిపోయింది.

'సందట్లో సడేమియా' అనీ, ఆ గోలలోనే "అన్న పూర్ణమ్మగారూ" అంటూ పేరయ్యగారు ప్రవేశించాడు.

"అయ్యో! నా మతి మండా! రండి పేరయ్య గారూ! మీ సంగతి మరిచేపోయానండీ!" అని అన్నపూర్ణమ్మ పేరయ్యని ఆహ్వానించింది ఎదురేగి.

"మీరు మరిచిపోతే మాత్రం నేను మరిచి పోతానా?.... మరి పెళ్ళి వారిని సాయంత్రం తీసుకు రమ్మంటారా? వారు సిద్ధంగానే ఉన్నారు" అన్నాడు పేరయ్య.

రేఖ కంగారుగా వొచ్చి — "అమ్మా, వొద్దని చెప్పు, తీసుకురావొద్దు!" అంది గట్టిగా.

"అదేవిటే. నిన్న అనుకున్నదేగా? నిన్న సరే అన్నావుగా?" అని తెల్లబోయింది అన్నపూర్ణమ్మ.

"అంటే అన్నాను. అది 'నిన్న'! ఇవ్వాళ చాలా నేర్చుకున్నాను. అసలు నాకు స్వంత సంపాదన ఉంటే తప్ప మిగతా విషయాలు ఆలోచించను. తనని తను పోషించుకోలేని మనిషి జీవచ్ఛవంతో సమానం అమ్మా! ఇక ఆ మనిషి 'స్వతంత్రం' గురించి ఆలో చించడానికేంవుంటుంది? 'ఆడా మగా సమానం' అని ఆలోచించే మనిషిని తప్పితే నేను చేసుకోను. అదంతా ఇప్పుడు కాదు. పేరయ్య గారికి చెప్పెయ్యి వద్దని."

అన్నపూర్ణమ్మ తూచా తప్పకుండా చక్కగా బుగ్గలు నొక్కుకుంటూ 'అవ్వ' అంది. "నువ్వు చెప్పింది పేరయ్యగారూ విన్నారుగా? ఇక నేను చెప్పే దేవిటీ? చూశారా పేరయ్యగారూ! ఏవిటో.... పెద్ద వాళ్ళు చెప్పడం, చిన్నవాళ్ళు వినడం, అంతా పోయిం దండీ ఈ రోజుల్లో!" అని తెగ నొచ్చుకుంది.

"పోనీ లెండమ్మా! తొందరే మొచ్చింది? అమ్మాయి మంచి మాటే చెప్పిందిగా? వాళ్ళ పెళ్ళిళ్ళు వాళ్ళే చేసుకుంటే, మనకి అంతకన్నా ఏం కావాలి? మనకీ బరువు తప్పుతుంది. మరి వెళ్ళొస్తానమ్మా" అని పేరయ్యగారు వెళ్ళి రావడానికి వెళ్తోంటే, హనుమంతు అడ్డం పడ్డాడు — "ఆఁ.... ఏమీ లేదండీ.... వంటలు

చేసే కుర్రాడు కావాలి. నా చేతికింద ఒకడు ఉన్నాళ్ళేండి! వాణ్ణి చేసుకుంటుంది లెండి!" అని ఎకసెక్కాలాడాడు.

జగన్నాథం — "అమ్మా రేఖా!" అని కూతుర్ని పిలిచాడు. "మీ అమ్మ రోజుకో సంబంధం చూస్తూనే వుంటుందిగానీ అవన్నీ పట్టించుకోకు. ముందు చదువు సంగతి చూసుకోమ్మా! తర్వాత చిన్న వదిన లాగా ఉద్యోగం సంపాదించుకో! ఆ తర్వాత.... కులం మతం అని లేదు.... నీ ఇష్టం...."

"అదే నాన్నా! అమ్మకి చెప్పేశాను!" అంది సంతోషంగా రేఖ.

"ఏవిటీ? కులం మతం చూడొద్దా? అవ్వా!" అని అన్నపూర్ణమ్మ చక్కగా బుగ్గలు నొక్కుకుందిగానీ, చప్పున పేరయ్యగారి సంగతి గుర్తొచ్చి అటు కదిలింది.

పేరయ్యగార్ని సాగనంపి లోపలికొస్తూ — "హనుమంతూ! ఇప్పుడేం ఇంటికి పోతారుగానీ, ఇద్దరూ ఉండిపొండి. సాయంత్రం వెళ్ళొచ్చు" అంది.

ప్రసాద్ ఆనందంతో మావయ్య మీద పడి — "అవును మావయ్యా! ఇక్కడే ఉండు. పద! వంట మొదలు పెడదాం" అని హనుమంతుని వంటింట్లోకి లాక్కుపోయాడు.

అరుణ బొడ్లో చెంగు దోపేసుకుని "అందరూ వినండి!" అని అందరికీ ఆర్డర్లు జారీచేసింది — "వాసూ! నువ్వు కూడా వంటింట్లోకి వెళ్ళు! పప్పు నానబెట్టి, కొబ్బరి పచ్చడి చెయ్యి!

రేఖా! నువ్వు అంట్లు తోమెయ్యి!

కమలా! నువ్వు గదులూ వాకిళ్ళూ వూడ్చుకురా!

నేను, సాయంత్రానికి కావలసిన బట్టలన్నీ ఉతికేస్తాను.

శకుంతల పిన్నీ! నువ్వు ఇంటికెళ్ళి, పనులు చేసుకుని తొందరగా వచ్చెయ్యి!

వేణూ! నువ్వు స్నానం చేసేసి ఏదన్నా చదువుకో! ఇంక నీకు సెలవ్!

అత్తయ్యా! మీరు మావయ్య స్నానం సంగతి చూడండి! తర్వాత చిన్నిగాడికి కూడా నీళ్ళు పోసేసి మీరూ స్నానం చెయ్యండి!

కమలా! చిన్నికి కూడా చిన్న చీపురియ్యి! నీ వెనకాల ఉంచుకుని వాడికి కూడా ఊడవడం నేర్పు!..."

అందరికీ ఆర్డర్లు జారీ అయ్యాక, ఎవరి పనిలోకి వాళ్ళు చకచకా కదిలారు.

అన్నపూర్ణమ్మ చిన్న కొడుకుని బతిమాలుతోన్నట్టు — "నాయనా వేణూ! నీకు కాస్త ఖాళీయేగా? కాస్త ఆ దీపం సెమ్మాలు తోమిపెడుదూ! స్నానం చేసివొచ్చి దీపం వెలిగించుకుంటానూ!" అని దీర్ఘం తీసింది.

వేణూ తల తిప్పేశాడు — "నేను నాస్తికుణ్ణని తెలీదూ నీకు? పూజలూ గీజలూ 'ఇంటి పని'లో భాగం కాదు. నేను చెయ్యను! నువ్వు కూడా మానెయ్యడం మంచిది! ఎన్నాళ్ళు ఉంటావు అమ్మా, ఇంత మూర్ఖంగా? అందరూ మారినా నువ్వు మారవా? ఆ నూనెలూ అవీ ఎందుకు వృధా చేస్తావు?" అనేసి వెళ్ళిపోయాడు.

"ఏవిటో అన్నిటికీ మంచివాడివే, దీనికే వొస్తుంది తిక్క నీకు" అనేసి పిల్లాణ్ణి మందలించాను లెమ్మని సంతృప్తిపడింది అన్నపూర్ణమ్మ.

అరుణ, కొడుకుని పిల్చి "నాన్నా! పిన్ని దగ్గర ఊడవడం నేర్చుకోమ్మా! తర్వాత నాయనమ్మతో నీళ్ళు పోయించుకో! నాన్నా తాతయ్యా అన్నం వొండేస్తున్నారుగా? అప్పుడు తినేద్దువు గానీ!" అని ముద్దుగా చెప్పింది.

చిన్నిగాడు ఆనందంతో ఉక్కిరిబిక్కిరైపోతూ — "అమ్మా! ఆదివారం వెళ్ళిపోయిందా?" అని ఎగబడ్డాడు.

అరుణ నవ్వి — "ఆదివారమా? సగం వెళ్ళిపోయిందీ, సగం ఉందీ! ఇప్పుడు పొద్దున్నలాగ కాదమ్మా! రోజూ నేనూ నాన్నా కలిసే నిన్ను పెంచుతాం. సరేనా? చీపురు తెచ్చుకో!"

చిన్నిగాడు ముందు నాయనమ్మ దగ్గిరికి పరిగెత్తాడు — "నాయనమ్మా, నాయనమ్మా! **అమ్మకి ఆదివారం ఉందంటా, లేదంటా!"**

['ఆంధ్రప్రభ' వారపత్రికలో 23-10-96 నించీ 5 వారాల వరకూ.] ★

## ఈ కథ గురించి:

ఈ కథ, 1996 నవంబరులో పుస్తకంగా వచ్చినప్పుడు దానికి ఒక 'ముందుమాట' రాశాను (18-11-1996). ఆ ముందుమాటనే ఇక్కడ ఇస్తున్నాను. —"ఈ పేరు గురించి ఒక మాట చెప్పాలి. దాదాపు ఇరవై ఏళ్ళకిందట ఏలూరు ప్రాంతంలో నక్సలైట్ ఉద్యమంలో ఉండిన ఒక విద్యార్థి, 'అమ్మకి ఆదివారం లేదా?' అనే పేరుతో ఒక కరపత్రం రాశాడని పదేళ్ళ కిందట విన్నాను. ఆ కరపత్రం కోసం ప్రయత్నించాను గానీ దొరకలేదు. అందులో విషయం ఏమిటో తెలీదు. ఆ విద్యార్థి పేరు కూడా తెలీదు. అప్పటినించీ నాకు ఆ పేరుతో, నేను చెప్పదల్చుకున్న విషయంతో, కథ రాయాలని వుండేది. కానీ ఇన్నాళ్ళూ ఆ ప్రయత్నం జరగలేదు.

ఈ మధ్య దాదాపు 4 నెలల కిందట, 'గృహిణుల విశ్రాంతి' గురించి రాజ్యసభలో 'సరోజ్ కపర్దీ' అనే కాంగ్రెస్ సభ్యురాలు, ఒక బిల్లు ప్రతిపాదించారు. ఆ బిల్లు సంగతి ప్రస్తావిస్తూ సెప్టెంబరు నెలలో రేడియోలో వచ్చిన ఒక కార్యక్రమం విన్నాను. "వంటా వడ్డనలూ ఆడవాళ్ళ చేతుల్తో జరిగితేనే అందంగా వుంటుంద"ని ఆ కార్యక్రమం తేల్చింది. ఆ బిల్లు గురించి జులై 28న 'ఈనాడు' దినపత్రికలో ఒక సంపాదకీయం వచ్చిందని తెలిసి, దాన్ని తర్వాత చూశాను. అది, గృహిణుల కష్టాల గురించి కొంత కన్నీరు వొలికించి, 'అవును, గృహిణుల విశ్రాంతి మాటేమిటి?' అని గొప్ప దయతో ప్రశ్నించి, 'ఇది సాధ్యమా?' అనే సందేహంతో వదిలేసింది. మరి ఏది సాధ్యమో అది తేల్చలేదు. 'ఈనాడు' సంపాదకీయం నించి కొన్ని వాక్యాలు: "ఇటీవల రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యురాలు సరోజ్ కపర్దే, గృహిణులు — ఇంటి పనులు, వంట పనులకు వారంలో ఒక రోజు స్వస్తి చెప్పి విశ్రాంతి తీసుకునేందుకు వీలు కల్పించాలంటూ ఓ బిల్లును ప్రతిపాదించారు. ఇల్లాళ్ళకు వారానికి ఒక రోజయినా విశ్రాంతి అవసరమనీ, ఆ అవకాశాన్ని చట్టప్రకారం కల్పించాలన్నదే ఈ బిల్లు పరమాశయం. గృహిణులు రెస్టు తీసుకునే రోజులో ఇంట్లోని ఇతర వ్యక్తులు ఇంటి పనులన్నీ చేస్తూ ఇల్లాలి విశ్రాంతికి భంగం రాకుండా చూడాలిట. ఇటువంటిదే ఒక బిల్లును ఇటీవల ఆస్ట్రియా పార్లమెంటులో ప్రవేశపెట్టారు. సరోజ్‌కపర్దే కూడా అటువంటి ప్రతిపాదనే చేశారు. ఈ బిల్లుకు రాజ్యసభలోని మహిళలు మద్దతు పలికారు. మరో కాంగ్రెస్ సభ్యురాలు వీణావర్మ ఈ ప్రతిపాదనను గట్టిగా సమర్ధిస్తూ — గృహిణులకు ఒక రోజన్నా విశ్రాంతిని కల్పించే ఈ మాదిరి చట్టం ఉండాల్సిందే నన్నారు. వేళాపాళా లేకుండా ఇరవై నాలుగు గంటలూ ఇంటి చాకిరికే అంకితమైపోతున్న మహిళలకు ఈ ప్రతిపాదన ఊరట కలిగించే మాట వాస్తవమే. అయితే ఇటువంటి చట్టం ఒకటి రూపొందినా అది కచ్చితంగా అమలు అయేటట్లు చూడటం సాధ్యమయే విషయమేనా అనేదే సందేహం. ఏ ఇంట్లోని మహిళ ఏ రోజు విశ్రాంతి తీసుకుంటుందో — ఆ రోజు ఆ ఇంట్లోని మగవారు ఇంటిపనులన్నీ సరిగ్గా చేస్తున్నారో లేదో — ఎవరు తొంగి చూసి కనిపెట్టగలరు?"

సమస్యలకు బూర్జువా తప్పుడు పరిష్కారాలు ఎలా వుంటాయో చూడడానికి ఈ బిల్లు ఒక మంచి ఉదాహరణ! సమస్యల్లో వున్న వాళ్ళ మీద పైకి ఎంతో సానుభూతి కురిపిస్తూ, నిజానికి వాళ్ళని మభ్యపెట్టి దారి తప్పించే ప్రయత్నాలే ప్రతీ సమస్యలోనూ జరుగుతూ ఉంటాయి. అలాగే ఈ సమస్యలో కూడా!

ఈ 'బిల్లు - వార్త' తర్వాతే నేనీ కథ రాశాను. దీనితోపాటే "ఇంటి పనీ —బైటిపనీ" అనే వ్యాసం కూడా రాశాను. ఆ వ్యాసం కూడా చూస్తే, ఈ సమస్యని అర్థం చేసుకోవడం తేలిక అవుతుంది. ★

**మార్క్సిజం తెలిసి వుండకపోతే, 'ఇంటి పని'కి, ఈ కథలో చెప్పినట్టు 'ఇద్దరికీ ఇంటిపనీ — ఇద్దరికీ బైటిపనీ' అనే పరిష్కారం చెప్పడం సాధ్యం కాదు.**

**18-7-2004**